TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 204 మంగళవారం, జూన్ 09, 2026 పేజీలు :8 వెల.1/-




# రైతుల గురించి మాట్లాడే అర్హత బి ఆర్ ఎస్ కు లేదు:మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూన్ 8:రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదని తమ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మద్దతు ధరతో పాటు అర్హులైన రైతులకు రూ. 500 బోనస్ అందిస్తూ నిరంతరాయంగా ధాన్యం సేకరిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తాముఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. జిల్లా యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరుపుతోంది. రాజకీయ విమర్శల కోసం వాస్తవాలను మరుగున పరచడం మీకు తగదని మాజీ మంత్రి హరీష్ రావు కు సూచించారు. సోమవారం మంత్రి విలేకర్ల సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. హరీష్ 2014, 2018 ఎన్నికల ముందు మీరిచ్చిన మేనిఫెస్టోలను ఒక్కసారి పరిశీలించండి. అందులో ఎన్ని హామీలను నెరవేర్చారో చెప్పండి..???రైతుబంధుకు మేం ఎగనామం పెట్టలేదు, అర్హులైన ప్రతి రైతుకూ 'రైతు భరోసా'ను పారదర్శకంగా అందించేందుకు కసరత్తు చేస్తున్నాం.వ్యవసాయానికి మరింత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ ను అందించాలనే సంకల్పంతోనే 'రైతు డిస్కం'కు శ్రీకారం చుట్టాం తప్ప రైతులకు ఉచిత కరెంట్ ను నిలిపేయడానికి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంది.రైతుల మేలు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలపై ఇలాంటి అపోహలు, అసత్య ప్రచారాలు చేయడం బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా మీకు తగదు హరీష్ రావు సింగరేణిపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోండి హరీష్ రావు కొంచెం స్టడీ చేసి మాట్లాడితే బాగుంటుంది.2014లో అప్పటి టీబీజీకేఎస్ అధ్యక్షురాలు, కవిత గారు, అప్పటి ఃఖీా ప్రభుత్వం కేంద్రము తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక, ప్రభుత్వ రంగ వ్యతిరేక ఎంఎం డి ఆర్చట్టానికి మద్దతు తెలిపింది నిజం కాదా?బొగ్గు గనుల వేలం ప్రక్రియలో ఎస్సీసీఎల్ పాల్గొనకుండా అడ్డంకులు సృష్టించి, మీ పార్టీకి అనుకూలమైన ప్రైవేట్ సంస్థలు, బినామీలకు బ్లాకులు వెళ్లే పరిస్థితులు కల్పించింది మీ ప్రభుత్వం కాదా?దాని ఫలితంగానే కోయగూడెం బ్లాక్-3 సత్తుపల్లి బ్లాక్-3వంటి విలువైన బొగ్గు గనులు సింగరేణికి దక్కకుండా పోయాయి. దీనివల్ల భవిష్యత్తులో సంస్థకు రూ.2000 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

# ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్న ఇండియా కూటమి నేతలు..

న్యూఢిల్లీ: ఇండియా బ్లాక్ పార్టీలు దేశ రాజధానిలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈరోజు (సోమవారం) కూటమిలోని అన్నీ పార్టీల నేతలంతా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధానం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. అనంతరం ఐదు కీలక నిర్ణయాలను ఇండియా కూటమి నేతలు ప్రకటించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఐదు నిర్ణయాలకు సంబంధించిన కీలక విషయాలను వెల్లడించారు. ఎస్ఐఆర్, నీట్-సీబీఎస్ఈ పరీక్షల వివాదం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల కష్టాలు, అణగారిన వర్గాల సమస్యల వంటి అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ఇండియా కూటమి తదుపరి సమావేశం తేదీని ఖరారు చేసినట్లు తెలిపారు.



**ఇండియా కూటమి ఐదు కీలక నిర్ణయాలు..**

1. ఎస్ఐఆర్, ఓట్ల లూటీ, ఎన్నికల అక్రమాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు.
2. నీట్, సీబీఎస్ఈ విద్యార్థులకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు.
3. దేశ ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతులు సహా ఇతర సమస్యలపై చర్చకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
4. ప్రతి రెండు నెలలకోసారి ఇండియా కూటమి భేటీ కావాలని నిర్ణయం తీసుకున్నారు. ఇండియా కూటమి తదుపరి సమావేశాన్ని ఆగస్టు 8న హైదరాబాద్‌లో నిర్వహించాలని తీర్మానించారు.
5. పార్లమెంట్ సమావేశాల సమయంలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో కూటమి ఎంపీలు ప్రతిరోజూ ఉదయం సమావేశమై కార్యాచరణపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ లో రవాణా శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న



వాహనాలను అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు.చెక్‌పోస్టులు రద్దు చేసిన సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేసిన మంత్రి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని మరింత సమర్థవంతంగా వినియోగించి తనిఖీలను పెంచాలని సూచించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, రాష్ట్ర స్థాయిలో 2 స్పెషల్ స్క్వాడ్‌లను తనిఖీలు ముమ్మరం చేయనున్నాయి.విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న మంత్రి, విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు రాష్ట్రంలో పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు.అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణాకు రైల్వే శుభవార్త




## ఆ మార్గంలో రూ.5 వేల కోట్లతో కొత్త రైల్వేలైన్!

న్యూఢిల్లీ: ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చగల ప్రతిష్టాత్మక రామగుండం - మణుగూరు సరికొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పాతికేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో సుమారు రూ. 5,818.45 కోట్ల అంచనా వ్యయంతో ఈ మెగా రైల్వే కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. రామగుండం నుండి మణుగూరుకు తగ్గుతున్న దూరం ప్రస్తుతం రామగుండం నుండి మణుగూరు వెళ్లాలంటే కాజీపేట, డోర్నకల్ జంక్షన్ల మీదుగా చుట్టూ తిరిగి దాదాపు 286 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ మార్గంలో రైళ్ల రద్దీ 140 శాతంగా ఉండటంతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. సరికొత్తగా ప్రతిపాదించిన ఈ నేరుగా ఉండే రైల్వే లైన్ పొడవు 207.80 కిలోమీటర్లు, ట్రాక్ పొడవు 247.80 కి.మీ. ఈ లైన్ అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య దాదాపు 90 కిలోమీటర్ల మేర ప్రయాణ దూరం తగ్గనుంది. బొగ్గు రవాణా ఖర్చులు భారీగా తగ్గడంతో పాటు రవాణా ప్రక్రియ వేగవంతం ఈ ప్రాజెక్ట్ సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్న కీలక ప్రాంతాలను కలుపుతూ ఒక వ్యూహాత్మక “కోల్ కారిడార్” గా మారనుంది. మణుగూరు, భూపాలపల్లి, రామగుండం ఏరియాల నుంచి వివిధ విద్యుత్ ఉత్పాదక కేంద్రాలకు, పరిశ్రమలకు బొగ్గు రవాణా ఖర్చులు భారీగా తగ్గడంతో పాటు రవాణా ప్రక్రియ అత్యంత వేగవంతం కానుంది. బొగ్గుతో పాటు ధాన్యాలు, సిమెంట్, ఖనిజాల రవాణాకు కూడా ఇది కీలక మార్గం కానుంది. పర్యాటక రంగానికి, గిరిజన ప్రాంతాలకు ఊతం ఈ నూతన రైలు మార్గాన్ని ప్రయాణికులకు కూడా ఎంతో సౌకర్యవంతంగా డిజైన్ చేశారు. ఈ లైన్ పెద్దపల్లి జిల్లాలోని రాఘవాపూర్ స్టేషన్ నుండి ప్రారంభమై మంథని, జయశంకర్ భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపూర్, గోపాల్‌రావుపేట, రామానుజపురం మీదుగా మణుగూరు వరకు సాగుతుంది.ఇది పూర్తిగా అటవీ మరియు గిరిజన ప్రాంతాల గుండా వెళ్లనుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుంది. ఈ మార్గాల గుండా రైల్వే లైన్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరం, ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం, లక్నవరం, బొగత జలపాతం వంటి పర్యాటక ప్రాంతాలకు ఈ రైల్వే లైన్ ద్వారా అద్భుతమైన కనెక్టివిటీ లభిస్తుంది.

## ప్ర రా బి నేటిమాట..

మొక్కకు రోజూ నీళ్లు పోయాల కానీ పూలు మాత్రం కాలం వచ్చినప్పుడే పూస్తాయి
ఓర్పుగా ఉండటం అలవర్చుకో నీ సమయం కచ్చితంగా వస్తుంది
మంచివాడిగా బ్రతకాలంటే ఎన్నో వదులుకోవాలి... కానీ చెడ్డవాడిలా బ్రతకాలంటే కేవలం మంచితనాన్ని వదులుకుంటే చాలు

- ప్రమీల రాణి బి

# ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే అమల్లోకి తేవాలి: కవిత



హైదరాబాద్: తెలంగాణలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (ఖుజఊ్ప్రు) మండిపడ్డారు. నాలుగు వేల పాఠశాలలు మాత్రమే నడిపిస్తానని అంటున్న రేవంత్ రెడ్డి హిట్లర్ మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువ అని ఘాటుగా విమర్శించారు. విద్యాశాఖపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఉండదని సీఎం ప్రకటించిన మరుసటి రోజే అడ్మిషన్లకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ ఇచ్చిందని పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై వారం రోజులు అవుతున్నా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు ఈ ప్రభుత్వం కనీసం అఫిలియేషన్‌లు ఇవ్వలేదని ఆక్షేపించారు.

డిగ్రీ అడ్మిషన్లను గందరగోళంగా మార్చేశారన్న కవిత.. ఉన్నత విద్యా మండలి కొన్ని కోర్సులను సిఫార్సు చేస్తే, కమిషనరేట్ మరికొన్ని కోర్సులు రిఫర్ చేసిందని తెలిపారు. వాటిలో ఏ ఒక్క కోర్సుకు కూడా యూనివర్సిటీలు అప్రూవల్ ఇవ్వలేదని.. అయినా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని కవిత అన్నారు. గురుకులాల్లో వంద మందికి పైగా విద్యార్థులు చనిపోయినా ఈ సీఎం కనీసం సమీక్ష చేయట్లేదని, రూ.11 వేల కోట్ల ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. జీవో 7ను రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే అమల్లోకి తెచ్చి ప్రైవేటు స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు.

# సంపాదకీయం

మంగళవారం, జూన్ 09, 2026

## డిజిటల్ తో పాటు క్యాష్ ట్రాన్సక్షన్స్...

పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అయితే చాలామంది ఆర్థికవేత్తలు డిజిటల్ చెల్లింపుల వల్ల నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయని.. మామూలు టీ షాప్ నుంచి కార్పొరేట్ హోటల్ వరకు అన్నింట్లోనూ డిజిటల్ విధానంలో చెల్లింపులు జరుగుతున్నాయని చెబుతున్నారు. కానీ డిజిటల్ యుగంలో కూడా పాత పరిస్థితే ఉంది. చదువుతుంటే ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదే విధంగా ఉంది.ఇప్పటి కాలంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అలాగని నగదు చెల్లింపులు తగ్గుముఖం పట్టలేదు. దేశంలో చలామణి అవుతున్న నగదు లెక్కలు ఇదే విషయాన్ని తేడా తెలియచేస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 10 సంవత్సరాల కాలంలో ఇది మూడు రెట్లు పెరిగింది. 2017 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా నగదు చలామణి 13 లక్షల కోట్లు ఉండేది.. 2026 ఆర్థిక సంవత్సరానికి అదేకంగా 41 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఏటీఎం నెట్వర్క్ మాత్రం దారుణంగా పడిపోయింది. 2023లో 2.19 లక్షలకు పైగా ఏటీఎం యంత్రాలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 2.09 లక్షలకు పడిపోయింది. నగదు ఉపసంహరణలు కూడా 32.6 లక్షల కోట్ల నుంచి 28.6 లక్షల కోట్లకు పడిపోయాయి.ఏటీఎంల సంఖ్య పడిపోవడంతో నగదును ఉపసంహరించుకోవడానికి చాలామంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎంలోకి వచ్చే నగదు పడిపోయిందని తెలుస్తోంది.. మార్చి, ఏప్రిల్ నెలల్లో.. మన దేశ వ్యాప్తంగా ఏటీఎంలో స్టోర్ చేసేందుకు 94 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. మార్చి నెలలో 61 వేల కోట్లు.. ఏప్రిల్ నెలలో 54 వేల కోట్లు మాత్రమే సమకూర్చారు. ఇక కేంద్రీకృత బ్యాంకు నివేదిక ప్రకారం గడిచిన నెల 22 నాటికి దేశంలో మొత్తం 42.54 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉందని తెలుస్తోంది. ఇక ఏటీఎం లావాదేవీలు గత ఏడాదితో పోల్చి చూస్తే 10.4% తగ్గింది.ప్రజలు డిజిటల్ చెల్లింపుల వైపు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం విచిత్రంగా ఉంది. డిజిటల్ తో పాటు నగదు లావాదేవీలు కూడా ప్రజలు నిర్వహిస్తున్నారు. అందువల్ల క్యాష్ స్పెక్యులేషన్ కూడా విపరీతంగా ఉంది. అయితే వచ్చే రోజుల్లో ఇది తగ్గే అవకాశం ఉంటుందా.. పెరుగుతుందా.. అనే విషయాలను ఇప్పుడే చెప్పలేమని ఆర్థిక నిపుణులు అంటున్నారు.రతదేశంలో ప్రస్తుతం నగదు వ్యవహారాలకంటే డిజిటల్ చెల్లింపులే ఎక్కువగా మారాయి. కిరాణం షాపు నుంచి పెద్ద పెద్ద చెల్లింపులు ఆన్ లైన్ లోనే జరుగుతున్నాయి. అయితే డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గడం లేదని కొన్ని నివేదికలను బట్టి తెలుస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం.. గత పదేళ్లలో చలామణిలో ఉన్న నగదు విలువ దాదాపు మూడు రెట్లు పెరిగింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థలో నగదుకు ఎంత ప్రాధాన్యం ఉందో తెలుస్తోంది. ఆర్ బీఐ లెక్కల ప్రకారం 2017 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చలామణిలో ఉన్న నగదు విలువ సుమారు రూ. 13 లక్షల కోట్లు. అయితే 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది రూ. 41 లక్షల కోట్లకు చేరింది. యూపీఐ, మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపు పద్ధతులు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ నగదు అవసరం తగ్గకపోవడం విశేషం.ఒకవైపు నగదు చలామణి పెరుగుతుండగా.. మరోవైపు ఎటీఎం నెట్వర్క్ క్రమంగా తగ్గుతోంది. 2023లో దేశవ్యాప్తంగా 2.19 లక్షలకు పైగా ఎటీఎంలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య సుమారు 2.09 లక్షలకు పడిపోయింది. బ్యాంకులు నిర్వహణ ఖర్చులు తగ్గించడం, డిజిటల్ లావాదేవీలపై ఎక్కువ దృష్టి పెట్టడం వంటి కారణాలు దీనికి ప్రధానంగా చెప్పబడుతున్నాయి. ఇదే సమయంలో ఎటీఎంల ద్వారా నగదు ఉపసంహరణలు కూడా క్రమంగా తగ్గుతున్నాయి. 2023లో ఎటీఎంల నుంచి సుమారు ?32.6 లక్షల కోట్ల నగదు ఉపసంహరించగా, ప్రస్తుతం అది ?28.6 లక్షల కోట్లకు తగ్గింది. అంటే ప్రజలు నగదును పూర్తిగా వదిలేయకపోయినా, అవసరమైనప్పుడు మాత్రమే తీసుకుంటూ రోజువారీ లావాదేవీలకు డిజిటల్ పద్ధతులను ఎక్కువగా వినియోగిస్తున్నారని అర్థమవుతోంది.యూపీఐ విప్లవం భారత ఆర్థిక వ్యవస్థలో పెద్ద మార్పును తీసుకొచ్చింది. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు క్యూ ఆర్ కోడ్ చెల్లింపులు సాధారణమయ్యాయి. దీంతో చిన్న మొత్తాల కోసం లకు వెళ్లాల్సిన అవసరం తగ్గిపోయింది.

- ఎడిటర్

# లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ....

చెన్నై, జూన్ 8, (న్యూస్ పల్స్)తమిళనాడు ఎన్నికల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మరో కోలీవుడ్ స్టార్ పొలిటికల్ ఎంట్రీకి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రీసెంట్‌గా ఎన్నికల్లో టీవీకే పార్టీ ఘన విజయం సాధించి స్టార్ హీరో విజయ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తనదైన పాలన మార్క్‌తో దూసుకెళ్తున్నారు. ఆయన పార్టీలో ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు,



డైరెక్టర్ రాఘవ లారెన్స్ జాయిన్ అవుతున్నారంటూ రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది.ఈ రూమర్స్‌కు లారెన్స్ చెక్ పెట్టారు. సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. 'నేను తిరుచ్చి ఈస్ట్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని పలు మీడియా ప్లాట్ ఫామ్స్‌లో ప్రచారం జరుగుతోంది. నా మీడియా మిత్రులు కొందరు నాకు ఫోన్ చేసి దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ నన్ను కలవాలని అభ్యర్థిస్తున్నారు. ఈ ఊహాగానాలు పెరిగిపోయి నేను దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని భావించినందున, ఈ విషయాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నా.నేను ప్రస్తుతం బెంజ్ సినిమా షూటింగ్‌లో ఉన్నాను. నా షెడ్యూల్ 10వ తేదీతో ముగుస్తుంది. మా అమ్మగారి ఆశీస్సులతో నా జీవితానికి సంబంధించి ఓ ముఖ్యమైన నిర్ణయం 11వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు అనౌన్స్ చేస్తాను.' అంటూ రాసుకొచ్చారు.ఏప్రిల్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి విజయ్ పోటీ చేసి రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకుని తిరుచ్చి ఈస్ట్ వదులుకున్నారు. దీంతో ఇక్కడ త్వరలోనే బై ఎలక్షన్ జరగనుంది.ఈ స్థానంలో లారెన్స్ టీవీకే తరఫు నుంచి పోటీ చేస్తారని కొన్ని రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిపైనే ఈ నెల 11న ఆయన క్లారిటీ ఇవ్వనున్నారు. మరి ఆయన విజయ్ పార్టీలో చేరి పోటీలో నిలుస్తారా మరేదైనా ప్రకటన చేస్తారా? అనేది ఆసక్తిగా మారిందిలారెన్స్ కేవలం నటనలోనే కాకుండా సామాజిక సేవలోనూ ఎప్పుడూ ముందుంటారు. తన తల్లి పేరు మీద అనాథలకు, వృద్ధులకు చేతనైన సాయం అందిస్తారు. అలాగే, మీడియాలో వచ్చిన కథనాలపైనా స్పందిస్తూ అవసరమైన వారికి తనకు తోచిన సాయం చేస్తుంటారు. ఆయన పొలిటికల్ ఎంట్రీ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# లద్దాక్ కు పోటెత్తున్న టూరిస్టులు



శ్రీనగర్ జూన్ 8, (న్యూస్ పల్స్)వేసవిలో టూరిస్టు ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. అయితే మన దేశంలో అందమైన కశ్మీర్‌లోని పహల్గాంలో గతేడాది జరిగిన ఘటనలో పర్యాటకులు కాస్త తగ్గారు. కానీ కేంద్రం, ఆర్మీ తీసుకున్న రక్షణ చర్యలతో ఈ వేసవిలో లద్దాక్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఈ మే నెలలో మొత్తం 72,834 మంది పర్యాటకులు లద్దాక్‌ను సందర్శించారు. గత ఏడాది మే నెలలో 32,927 మంది మాత్రమే వచ్చిన విషయాన్ని పోలిస్తే ఇది 121.2% అద్భుత పెరుగుదల. లద్దాక్ టూరిజం చరిత్రలో ఇది ఒక నిజమైన మైలురాయి. జనవరి నుంచి మే వరకు మొత్తం 1,17,546 మంది సందర్శకులు వచ్చారు. గతేఏడాది అదే కాలంతో పోలిస్తే 43.65% వృద్ధి. ఇందులో దేశీయ పర్యాటకుల సంఖ్య 1,10,585 (45.9% పెరుగుదల), విదేశీయులు 6,961 (15.5% పెరుగుదల). లద్దాక్ ఆర్థిక వ్యవస్థలో టూరిజం ఎంత కీలక పాత్ర పోషిస్తోందో స్పష్టంగా చెప్పే సంకేతాలు.లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ వృద్ధిని సమర్థించడమే కాకుండా, టూరిజం రంగానికి స్థానికులకు ఉపాధి కల్పించే ముఖ్యమైన ఇంజిన్‌గా అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో గత కొన్ని నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి. హోటల్స్, హోమ్‌స్టేలు, టూర్ ఆపరేటర్ల కోసం ఏకీకృత, సరళీకృత రిజిస్ట్రేషన్ విధానం, టూరిజం యూనిట్లకు "ఇండస్ట్రీ" స్టేటస్ ఇవ్వడంకాంప్లయన్స్ భారం తగ్గించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించాయిఈ సంస్కరణలు స్థానిక యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాయి. హోమ్‌స్టేలు, ట్రాన్స్‌పోర్ట్, హ్యాండిక్రాఫ్ట్, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాల్లో ఉపాధి పెరిగింది. మెరుగైన రోడ్డు కనెక్టివిటీ, ఎక్కువ విమాన సర్వీసులు, సోషల్ మీడియా ద్వారా లద్దాక్ సౌందర్యం వైరల్ కావడం, పోస్ట్?పాండమిక్ ట్రావెల్ బూమ్ ఈ సీజన్‌ను రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి. ప్రత్యేకించి మే నెలలో రోడ్లు తెరవడం, అనుకూల వాతావరణం, పర్వతాలు, సరస్సులు, మఠాలు, అడ్వెంచర్ యాత్రలు కలిపి ఒక అద్భుతమైన అనుభవాన్ని అందిస్తున్నాయి. ఈ అపూర్వ వృద్ధి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, లద్దాక్ పర్యావరణ సున్నితత్వాన్ని మరచిపోకూడదు. ఇప్పటికే పాపులర్ స్పాట్లైన పాంగాంగ్ లేక్, నుబ్రా వ్యాలీ, లే?మనాలి హైవేల్లో క్రౌడింగ్, వాస్తే మేనేజ్‌మెంట్, నీటి కొరత, వాహనాల నుంచి వచ్చే కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. లద్దాక్ ఒక ఫ్రాజైల్ ఎకోసిస్టమ్.

ఇక్కడ టూరిజం వృద్ధి చెందాలంటే అది సస్టైనబుల్, రెస్పాన్సిబుల్ టూరిజంగా మాత్రమే ఉండాలి. ప్రభుత్వం, స్థానికులు, టూరిజం స్టేక్‌హోల్డర్లు కలిసి పనిచేసి, క్యాపాసిటీ బిల్డింగ్, ఆఫ్?సీజన్ టూరిజం ప్రోత్సాహం, ఎకో?టూరిజం, వేస్ట్ మేనేజ్‌మెంట్, కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించడం వంటి వ్యూహాలను అమలు చేయాలి.లద్దాక్ టూరిజం ప్రస్తుతం చూస్తున్న ఈ బూమ్ ఒక అపూర్వ అవకాశం. సరైన ప్రణాళిక, స్థానికుల పాల్గొన్నత, పర్యావరణ సంరక్షణతో కూడిన విధానాలతో ఈ వృద్ధిని మరింత స్థిరంగా, అర్థవంతంగా మార్చుకోవాలి. లద్దాక్ కేవలం ఒక టూరిస్ట్ డెస్టినేషన్ కాదు.. ఇది ఒక ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, ప్రకృతి. దానిని కాపాడుకుంటూ అభివృద్ధి చేయడమే నిజమైన విజయం.

# ప్రజా పాలన సభలో ప్రజలు ఎక్కడ

### సభలు వార్డు ఆఫీసర్లకా మున్సిపల్ సిబ్బందికా ప్రజలకా
### నకిరేకల్ మున్సిపాలిటీలో తీరు మార్చుకోని మున్సిపల్ అధికారులు



నకిరేకల్, జూన్ 08 : గ్రామ, వార్డు స్థాయి నుంచి ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" వార్డు సభల ముఖ్య ఉద్దేశం. కానీ నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోనీ వార్డు సభలలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు మూడు వార్డు సభలు నిర్వహించగా ఒక్క వార్డు సభలో వందమంది ప్రజలు కూడా హాజరు కాకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. మొన్న కడపర్తి రోడ్డులో నిర్వహించిన సభలో 30 మంది కూడా లేకపోవడం, శనివారం మూసి రోడ్డులోని గీత మందిరంలో నిర్వహించిన వార్డు సభలో కేవలం 50 మంది కూడా లేకపోవడం, ఇవాళ సోమవారం నిర్వహించిన జెడ్పీహెచ్ఎస్ లో వార్డు సభలో 30 మంది లేకపోవడం గమనార్హం. ప్రజలతో చర్చించాల్సిన సమస్యల గుర్తింపు, సేవల వికేంద్రీకరణ, అభివృద్ధి పనుల ప్రగతి, పారదర్శకత లాంటి అంశాలను ప్రజలతో కాకుండా, వార్డు సభలకు హాజరైన మున్సిపల్ సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో చర్చిస్తారా? అని పలువురు చర్చించుకుంటున్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల యాక్షన్ ప్లాన్) లో భాగంగా సోమవారం నకిరేకల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 14, 15, 16 వార్డులకు గాను వార్డు సభలను నిర్వహించారు. ఐదు వార్డులకు కలిపి దాదాపు 4,500 మంది ప్రజలు ఉన్నా ఈ వార్డులలో కనీసం 30 మంది కూడా హాజరు కాకపోవడం ప్రజలకు మున్సిపల్ అధికారులు ప్రచారం నిర్వహించకపోవడమే కారణమని తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు పది నుండి 15 వాహనాలు ఉన్న 20 వార్డులలో ఏ ఒక్కరోజు వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేయకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఒకవేళ వార్డు సభలకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో తరలివస్తే సమస్యల వినుతులు ఎక్కువ అవుతాయని, వాటిని పరిష్కరిస్తామో లేదో అనే సందిగ్ధంలో మున్సిపల్ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.ఏదేమైనా నకిరేకల్ మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంపై స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ వార్డు సభలలో మళ్లీ మళ్లీ ఇలాంటి సీన్లు రిపీట్ అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు తమ తీరును ముందుకు మార్చుకోవడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఈ వార్డు సభలలో వచ్చిన 30 మంది ప్రజల నుండి ఏ ఒక్క వినతి పత్రము తీసుకోకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో కమిషనర్ సతీష్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ అజ్మీరా కిరణ్, పర్యావరణ ఇంజనీర్ నాగరాజు, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రబుల్ షూటర్ కు వరుస ట్రబుల్స్

బెంగళూరు, జూన్ 8, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరు పొందారు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్. ఆర్థికంగా బలవంతుడు. ఆలోచనలో ఉన్నత వంతుడు. పైగా అనేక సంక్షోభాలలో పార్టీని గట్టెక్కించాడు. పైగా సోనియాగాంధీకి అత్యంత నమ్మకమైన వ్యక్తి. అందువల్లే అంతటి సిద్ధరామయ్యను కూడా పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ డీకే శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేసింది.శివకుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు అంతా కూడా సానుకూలంగా ఉంటుందని.. మంత్రులు.. మిగతా ఎమ్మెల్యేలు మొత్తం సహకరిసారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన సీఎం పీఠాన్ని అధిష్టించిన ఒక్కరోజు వ్యవధిలోనే కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన వరుసగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తన కోరుకున్న శాఖ రాలేదని రామలింగారెడ్డి పదవికి రాజీనామా చేశారు. తన కోరుకున్న శాఖ ఇవ్వలేదని మరో మంత్రి మునియప్ప నిరసన తెలిపారు. తనకు చెప్పకుండా అధికారులను మార్చారని ఇంధన మంత్రి జార్జ్ అసంతృప్తిని వ్యక్తం చేశారు.. పీసీసీ పగ్గాలు తనకు అప్పగించలేదని మరొక మంత్రి సతీష్ అలక పాన్పు ఎక్కారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరాజయాన్ని చవిచూసింది. తమిళనాడులో ఐదు స్థానాలు గెలుచుకున్నప్పటికీ.. విజయ్ పార్టీకి అవసరం కాబట్టి కాంగ్రెస్ పరువు కాస్త నిలబడింది. మిగతా రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ దారుణమైన ఫలితాలను చవిచూసింది. ఒకరకంగా చెప్పాలంటే జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీ కంటే హీనంగా మారిపోతుంది. ఒకప్పుడు దేశ రాజకీయాలను మొత్తం శాసించిన హస్తం పార్టీ ఇప్పుడు ఇలా మారిపోవడం కార్యకర్తలకు మింగుడు పడడం లేదు.దక్షిణ భారత దేశంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఉన్న రాష్ట్రాలలో కర్ణాటక అత్యంత కీలకమైనది. ఈ రాష్ట్రం మీద బిజెపి అధినాయకత్వం ఫోకస్ చేసింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే గెలిచి అధికారాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తోంది. వాస్తవానికి బిజెపికి దక్కకుండా కాంగ్రెస్ పార్టీ ఇక్కడ రాజకీయాలు చేయాల్సి ఉండేది. కానీ సిద్ధరామయ్య.. డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు వల్ల కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తీవ్రమైన ఇబ్బందులు పడుతోంది.అనేక రకాల చర్చల తర్వాత శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చినప్పటికీ మంత్రులు బహిరంగం గానే తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం.. రాజీనామా చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఘోరంగా మారుతుంది. అంతటి ట్రబుల్ షూటర్ డీకే కూడా తలనొప్పితో బాధపడుతున్నాడు అంటే కర్ణాటకలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

# రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు

### అందుబాటులో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా
### రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు
### యాప్ ద్వారా ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా
### యూరియా పంపిణీ కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

నిజామాబాద్, జూన్ 08 : జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాల కంటే నిజామాబాద్ జిల్లాలోనే అత్యధిక స్థాయిలో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని అన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకమైన పంపిణీ కోసం యూరియా బుకింగ్ యాప్ దోహదపడుతోందని అన్నారు. ఈ యాప్ పనితీరును గమనించిన ఇతర రాష్ట్రాలు కూడా ఒక్క యూరియానే కాకుండా మిగతా అన్ని ఎరువులను కూడా బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆయా మండలాల్లో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉంది అనే సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉందని, రైతులు సమీప డీలర్ల వద్ద పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా ప్రతీ సొసైటీ వద్ద, ప్రతీ డీలర్ షాప్ లో ఎరువుల నిల్వల వివరాలను తెలియజేసేలా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాలకు ఆస్కారం లేకుండా మండల స్పెషల్ ఆఫీసర్లతో పాటు తహసిల్దార్లు, ఇతర అధికారులతో నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసి అట్టిపెట్టుకోకుండా, తమ అవసరాలకు అనుగుణంగా దశల వారీగా ఎరువులు తీసుకోవాలని, మోతాదుకు మించి వాడవద్దని హితవు పలికారు. ఎరువుల దుకాణాలు, వివిధ సంస్థల ద్వారా యూరియా, ఇతర ఎరువులు కొనే రైతులకు వారి అంగీకారం లేకుండా వేరే ఏ రకమైన ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. యూరియా ఎరువులతో ముడిపెడుతూ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతులను బలవంతం చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.



# ఆర్మీ జవాన్ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం..!

### మెదక్ పట్టణంలో ఆర్మీ ఉద్యోగి దారుణ హత్య..!

మెదక్ మెదక్ పట్టణంలో ఆర్టీ జవాన్ దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని పొన్నం కుమార్ ని భార్య, అత్తమామ, బావమరిది హత్య చేసారు. ఇంట్లో ఇద్దరు ఏకాంతంగా ఉండగా భార్య రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. ఆగ్రహంతో పొన్నం కుమార్ ని తీవ్రంగా కొట్టి హత్య చేసి..ఆతర్వాత మెదక్ టౌన్ పీఎస్లో నిందితులు లొంగిపోయారు. మృతుడు కుమార్ ఉత్తరాఖండ్లో ఆర్మీ విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం సెలవుల్లో ఉన్నాడు. ఈ నెల 10న విధులకు వెళ్లాల్సి ఉండగా హత్యకు గురైయాడు.

# సిద్ధిపేట రైల్వే స్టేషన్ పనులు పూర్తి

మెదక్ జూన్ 8, (న్యూస్ పల్స్)తెలంగాణలో మరో రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేసుకుని.. ప్రారంభోత్సవానికి రెడీ అయింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి రైలు స్టేషన్ పనులు దాదాపు పూర్తి అయినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజీవ్ రహదారికి పక్కనే, కొమురవెల్లి మల్లన్న ఆలయానికి దగ్గర్లో ఉండే ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే.. ఆ పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం, కొత్త రైలు మార్గాలు, పాత రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తోంది. దీంతో తెలంగాణలో ఇప్పటికే పలు కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణాలు పూర్తై అందుబాటులోకి రాగా.. మరికొన్నింటి నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఇక కొన్ని రైల్వే స్టేషన్‌లకు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణలో ప్రముఖ దేవస్థానమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి అతి దగ్గర్లో కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. అయితే కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని.. త్వరలోనే భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు.. లకుడారం – దుద్దెడ మధ్య రైల్వే శాఖ కొమురవెల్లి హాల్ట్ రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు 99 శాతం పూర్తి అయ్యాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం ఒక ట్వీట్ చేశారు. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణానికి 2024 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేయగా.. రూ. 5.63 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా నిర్మించారు.ఇక రైల్వే ప్రయాణికుల కోసం ఈ కొమురవెల్లి స్టేషన్‌లో పలు అత్యాధునిక వసతులను కల్పించారు. 450 మీటర్ల పొడవైన హై లెవల్ ప్లాట్‌ఫారమ్.. 5 షెల్టర్లు, విశాలమైన వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్లు, తాగునీటి వసతి.. మహిళలు, పురుషులు, దివ్యాంగులకు స్పెషల్ మరుగుదొడ్లను నిర్మించారు. ఈ రైల్వే స్టేషన్‌కు మెరుగైన అప్రోచ్ రోడ్లు, విశాలమైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కొమురవెల్లి రైల్వే స్టేషన్ ఆర్కిటెక్చరల్ ఎలివేషన్, మల్లన్న స్వామి, స్థానిక ప్రకృతి అందాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించారు.ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణంతో భక్తులు మల్లన్న దేవాలయానికి సులభంగా, నేరుగా చేరుకునే అవకాశం కలగనుంది. రాజీవ్ రహదారికి (ఎస్‌హెచ్–1) సమీపంలో ఈ రైల్వే స్టేషన్ ఉండటం వల్ల ప్రయాణం మరింత సజావుగా సాగుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో రూపుదిద్దుకున్న ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ ద్వారా తెలంగాణలో ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడటమే కాకుండా.. ఆధ్యాత్మిక పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏఐసీసీ రేసులో....

హైదరాబాద్ జూన్ 8, (న్యూస్ పల్స్)తెలంగాణ నుంచి ఏఐసీసీలో ఎవరెవరికి చోటు దక్కే అవకాశం ఉంది? ఒకరిద్దరు మంత్రుల్ని కూడా పార్టీ హెడ్క్వార్టర్స్‌కు పంపుతారన్నది నిజమేనా? అసలు మార్పుల విషయమై కాంగ్రెస్ వర్గాల అంచనాలు ఎలా ఉన్నాయి? దేశ వ్యాప్తంగా పార్టీ ప్రక్షాళనకు డిసైడ్ అయ్యింది కాంగ్రెస్ అధిష్టానం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నాయకుల సేవలు ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ గురించి ప్రస్తుతం పార్టీ వర్గాల్లో రకరకాల ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో భారీ మార్పులు ఉంటాయన్న సంకేతాల నడుమ తెలంగాణ నాయకుల స్థానం ఎక్కడన్న ఆరాలు మొదలయ్యాయి. రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ఎవరికి చోటు దక్కుతుంది..? ఇక్కడి సీనియర్ నాయకుల సేవల్ని అక్కడ వాడుకోవాలని భావిస్తోందా..!? ఇంతకీ? తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఎవరు ఏఐసీసీలోకి వెళ్ళబోతున్నారనే చర్చలు పార్టీ వర్గాల్లో జోరుగా జరుగుతున్నాయి. సాధారణంగా ఏఐసీసీ పోస్టుల భర్తీ విషయంలో అన్ని రాష్ట్రాలకు వాటా దక్కుతుంది. అవసరం, అవకాశాన్ని బట్టి ప్రాధాన్యతలు మాత్రమే మారుతుంటాయి. తెలంగాణ నుంచి చాలామంది నాయకులు ప్రస్తుతం ఏఐసీసీ కార్యదర్శులుగా బాధ్యతల్లో ఉన్నారు.మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కీ.. చిన్నారెడ్డి..వంశీ?సంపత్ లాంటి వాళ్ళు ఆ పదవుల్లో ఇంకా కొనసాగుతున్నారు. ఈసారి ఏఐసీసీలో అధికార ప్రతినిధులు.. మరి కొన్ని పదవుల్లో కూడా తెలంగాణకి ప్రాధాన్యత దక్కే అవకాశం లేకపోలేదు. అయితే?దానికి అనుబంధంగా మరో ఆసక్తికరమైన చర్చ కూడా జరుగుతోంది. రాష్ట్రంలో క్యాబినెట్ విస్తరణ గనుక జరిగితే ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తారన్న ప్రచారం ఉంది. అందులోనూ కీలకంగా ఉండే వాళ్లనే బయటికి పంపుతారన్న ప్రచారంతోఒకవేళ అదే జరిగితే వాళ్లని ఎలా సంతృప్తి పరుస్తారన్న ప్రశ్నలు వస్తున్నాయి. కేబినెట్ నుండి తప్పించే పరిస్థితే ఉంటేసదరు నేతల్ని ఏఐసీసీలోకి తీసుకుని పొరుగు రాష్ట్రాలకు పార్టీ ఇన్ఛార్జ్‌లుగా పంపవచ్చని తెలుస్తోంది. పార్టీలో కీలకంగా క్రియాశీలకంగా పని చేసిన వాళ్ళేగనక ఆ లిస్ట్‌లో ఉంటే ఏఐసీసీలోకి తీసుకోవాలన్న ఆలోచన కూడా జరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. మంత్రులను పక్కనబెడితే పార్టీ కోసం పని చేస్తున్న వారిలో మరికొందరిని అధిష్టానం హెడ్ క్వార్టర్స్‌లోకి తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఎఐసిసిలో ఉన్న వాళ్లను కంటిన్యూ చేస్తారా..? లేదంటే కొత్త వారిని కూడా తీసుకుంటారా అనేది ? వారంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది

# ఆర్మూర్ లో గుప్తా వర్సెస్ గుప్తా

నిజామాబాద్ జూన్ 8, (న్యూస్ పల్స్)నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మధ్య రాజకీయ వైరం పీక్స్‌కు చేరిందట. ఇద్దరి మధ్య విమర్శలు ప్రతివిమర్శలు, సవాళ్లు–ప్రతిసవాళ్లతో స్థానిక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బీజేపీ శాసనసభ్యుడు ధన్‌పాల్‌కు మాస్ లీడర్‌గా ప్రజల్లో గుర్తింపు ఉంది. వివాదాలకు దూరంగా, నిత్యం ప్రజలకు దగ్గరగా ఉంటారని కూడా చెప్పుకుంటారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బిగాలను మిస్టర్ డెవలప్‌మెంట్ అని పిలుస్తుంటారు స్థానికంగా. పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బిగాల గణేష్ గుప్తా? అర్బన్ అభివృద్ధికి బాగానే పని చేసినట్టు చెప్పుకుంటారు. అలా? ఇద్దరిలో ఎవరి క్రేజ్ వారికి ఉన్నా?. ఇద్దరిదీ ఒకే సామాజికవర్గం అయినా?.చెరో పార్టీలో ఉండటం వల్ల ఏళ్ళుగా రాజకీయ వైరం కొనసాగుతోంది. గతంలో బిగాల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. ప్రతిపక్ష నేతగా ఉన్న ధన్‌పాల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసేవారు. అభివృద్ధి పనుల్లో జాప్యంపై సమయం దొరికినప్పుడల్లా మాటల తూటాలు పేల్చేవారు. అలా.. ఇద్దరు ఉప్పు–నిప్పులా మారారు. కానీ? తర్వాత ఓడలు బండ్లు– బండ్లు ఓడలు అయ్యాయినిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ధన్‌పాల్ ఎమ్మెల్యే అవగా? బిగాల మాజీగా మిగిలిపోయారు. తన హయాంలో మొదలుపెట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ఎమ్మెల్యే ధన్‌పాల్ కావాలనే నిర్వీర్యం చేస్తున్నారంటూ అవకాశం దొరికినప్పుడల్లా.. విమర్శిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే. అందుకు సిట్టింగ్ కూడా ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తున్నారు.

# 10 శాతం పెరగనున్న మద్యం ధరలు



హైదరాబాద్, జూన్ 8, (న్యూస్ పల్స్)తెలంగాణలోని మందుబాబులకు నిజంగా ఇది చేదువార్తే. రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉంది. ధరల సవరణపై ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల దృష్ట్యా మద్యం ధరలను కనీసం 10 శాతం పెంచాలని కంపెనీలు డిమాండ్ చేస్తుండగా.. ధరలు పెంచితే పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి సరిహద్దుల ద్వారా అక్రమ మద్యం రవాణా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సంప్రదింపులు జరుపుతోంది.తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం ధరల సవరణపై అధ్యయనం చేయడానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ అధ్యక్షతన ఏర్పాటైన త్రిసభ్య కమిటీ బుధవారం నుండి మూడు రోజుల సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, చార్టర్డ్ అకౌంటెంట్ నవీన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. మద్యం కొనుగోలు ధరల పెంపు నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు మద్యం కంపెనీల నుంచి వస్తున్న ధరల పెంపు ఒత్తిడి, మరోవైపు ధరలు పెంచితే పొరుగు రాష్ట్రం నుండి ముంచుకొచ్చే అక్రమ మద్యం స్మగ్లింగ్ ముప్పు.. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించేందుకు ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. విచారణలో మద్యం తయారీ కంపెనీల ప్రతినిధులు కమిటీ ముందు హాజరై తమ నివేదికలను సమర్పించారు. మద్యం తయారీకి అవసరమయ్యే ముడిసరుకులు, ప్యాకేజింగ్ మెటీరియల్స్, రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని వారు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా తమకు లాభసాటిగా ఉండాలంటే కనీసం 10 శాతం మేర కొనుగోలు ధరలను పెంచాలని వారు అభ్యర్థించారు. అయితే మద్యం కంపెనీల డిమాండ్ సమంజసంగానే ఉన్నప్పటికీ ధరలను భారీగా పెంచితే అది రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయానికి గండికొట్టే ప్రమాదం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణ సుదీర్ఘమైన అంతరాష్ట్ర సరిహద్దును పంచుకుంటోంది. తెలంగాణలో మద్యం ధరలు గనుక విపరీతంగా పెరిగితే.. రెండు రాష్ట్రాల మధ్య రేట్ల వ్యత్యాసం భారీగా పెరుగుతుందని అంటున్నారు .తెలంగాణలో కొనుగోలు ధరలు పెరిగితే.. అది అంతిమంగా రీటైల్ ధరలపై ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో గనుక రీటైల్ ధరలు తక్కువగా ఉంటే సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి ప్రాంతాల ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుంచి మద్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల తెలంగాణకు రావాల్సిన పన్నుల రూపంలోని భారీ ఎక్సైజ్ రాబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. అటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతూనే ఇటు సరిహద్దు ముప్పును అరికట్టేలా జస్టిస్ సునీల్ కిషోర్ కమిటీ ఎలాంటి సిఫార్సులు చేయబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మరో వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీసీ నేత.

కరీంనగర్, జూన్ 8, (న్యూస్ పల్స్)వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది బీఆర్ఎస్ అధిష్టానం. అందులో భాగంగా సభ్యత్వ నమోదును ప్రయారిటీలో తీసుకుని ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయి ఇన్చార్జ్‌లను నియమించారు. ఆపని పూర్తవగానే?. గ్రామ, మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఈసారి ఆ కార్యవర్గమే సంచలనం అయ్యే అవకాశం ఉందని చెప్పుకుంటున్నాయి గులాబీ వర్గాలు. వెనుకబడిన తరగతులకు ప్రతినిధిగా పార్టీలో ఓ పెద్ద పోస్ట్ క్రియేట్ చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ ఉన్నారు. పార్టీ వ్యవహారాలన్నీ ఈ రెండు పదవుల చుట్టూనే తిరుగుతుంటాయని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. అయితే? ఇక్కడే కొత్త ఆలోచన చేస్తోందట అధిష్టానం. కుటుంబ ముద్ర నుంచి బయటపడటంతో పాటు సామాజిక సమీకరణల్ని గట్టిగా పాటిస్తున్నామని చెప్పే క్రమంలో?కేటీఆర్‌కు సమాంతరంగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌ని సృష్టించాలనుకుంటున్నట్టు సమాచారం. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే సెప్టెంబర్, అక్టోబర్‌లోనే ఈ కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకాన్ని కూడా చేపట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది.ఆ పోస్ట్‌లో ఒక బీసీ నేతను నియమించాలనుకుంటున్నారన్నది బీఆర్ఎస్ ఇంటర్నల్ టాక్. కొత్తగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు పార్టీ నేతలు. ప్రస్తుతం దేశంతో పాటు రాష్ట్రంలో కూడా బీసీ ఉద్యమం వాయిస్ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పదేపదే చెబుతోంది. ఈ సమయంలో బీసీలకు న్యాయం చేసేది తామేనని చెప్పుకునే క్రమంలో కేటీఆర్ స్థాయికి సమానంగా ఉండే మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ సృష్టించి దాన్ని బీసీ నేతలు ఇవ్వాలని భావిస్తున్నారట. అలా?. బీసీ నేతకు పార్టీలో కేటీఆర్‌తో సమాన స్థాయి ఇవ్వడం ద్వారా బలహీనవర్గాలకు ప్రాధాన్యం, కుటుంబ ముద్ర చెరిపేసుకోవడం లాంటి బహుళ లక్ష్యాలను సాధించాలనుకుంటున్నట్టు సమాచారం. ఆ కొత్త పదవికి ఎవర్ని ఎంపిక చేయాలనే దానిపై కూడా కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లకు, హైదరాబాద్ మహబూబ్ నగర్ రంగారెడ్డి జిల్లాల పట్టభద్రుల స్థానానికి త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. కాబట్టి ఆ జిల్లాలకు సంబంధించిన నేతను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటిస్తారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముందు వరసలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉన్నట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం తలసాని గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలోనే సమావేశాలు జరుగుతున్నాయి. వచ్చే గ్రేటర్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయనకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారన్న అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. మరోవైపు తలసానితో పాటు మరికొంత మంది బీసీ నేతల పేర్లు కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి రేస్‌లో వినిపిస్తున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేరు కూడా పరిశీలనలో ఉందట. ఉత్తర తెలంగాణలో కీలక నేతగా ఉన్న మరో మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేరు కూడా బీసీ కోటాలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే? పార్టీలో సీనియర్ నేత అయిన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనా చారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయట. దీంతో? ఫైనల్‌గా కొత్త పదవి ఎవర్ని వరిస్తుందోనని ఆసక్తిగా చూస్తున్నాయి గులాబీ వర్గాలు.

# నార్వే చెస్ విజేత ప్రజ్ఞానందకు సీఎం విజయ్ సత్కారం..

నార్వే చెస్ 2026 టోర్నమెంట్‌లో చరిత్రాత్మక విజయం సాధించిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రత్యేకంగా సత్కరించారు. తమిళనాడు సచివాలయంలో ప్రజ్ఞానందను కలిసిన సీఎం విజయ్, రూ.50 లక్షల నగదు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రజ్ఞానందతో సరదాగా చదరంగం ఆడారు. ఇద్దరి మధ్య జరిగిన చిన్నపాటి ఆటలో ప్రజ్ఞానంద కొద్ది ఎత్తుల్లోనే ముఖ్యమంత్రికి చెక్‌మేట్ ఇచ్చారు. ఆట అనంతరం ముఖ్యమంత్రితో చెస్ ఆడే అవకాశం వస్తుందని తాను ఊహించలేదని ప్రజ్ఞానంద తెలిపారు. ఇది తనకు ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి కూడా తన స్నేహితులతో తరచూ చదరంగం ఆడతానని చెప్పారని వెల్లడించారు.ఇటీవల నార్వేలోని ఓస్లోలో జరిగిన నార్వే చెస్ 2026 టోర్నమెంట్‌లో ప్రజ్ఞానంద అద్భుతమైన ప్రదర్శనతో విజేతగా నిలిచారు. చివరి రౌండ్‌లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది.



# సేమ్ సెంటర్... సేమ్ ప్లేస్...

## ఎటాక్ మోడ్ లో గులాబీ దళం




వరంగల్, జూన్ 8, (న్యూస్ పల్స్)వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్లాన్ చేస్తోంది బీఆర్ఎస్. ఆ ఊపులోనే?. అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు పావులు కదుపుతోంది. అందుకోసం ఎన్నికల ప్రచారంలో హస్తం నేతలు ఇచ్చిన హామీలు, గ్యారంటీలనే అస్త్రాలుగా వాడాలనుకుంటోందట. అసెంబ్లీ ఎలక్షన్స్‌కు ముందు కాంగ్రెస్ నేతలు రకరకాల డిక్లరేషన్స్ ప్రకటించగా. ఇప్పుడు వాటి అమలు కోసం వత్తిడి చేయడంతో పాటు చేయకుంటే ప్రజల్లోకి వెళ్ళి ఉద్యమ రూపం తీసుకువచ్చేందుకు ప్లానింగ్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే డిక్లరేషన్స్ ప్రకటించిందో ఇప్పుడు అదే ప్రాంతాలకు అక్కడి నుంచే సమరానికి సై అంటోంది గులాబీ దళం. రెండు నెలల క్రితం వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభను అలాగే నిర్వహించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అక్కడే రైతు డిక్లరేషన్‌ను ప్రకటించింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, సీనియర్ నేతలందరూ హాజరైన ఈ సమావేశం బాగా సక్సెస్ అయిందనట్టు బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే అదే ఊపుతో నెలకో సభ పెట్టి?దూకుడుగా ముందుకు వెళ్ళాలని అనుకున్నా? ఆ పని జరగలేదు. ఊపు వచ్చాక ఒక్కసారిగా పార్టీ పెద్దలు ఎందుకు ఆగారో అర్థంగాక కింది స్థాయిలో బుర్ర గోక్కుంటున్నారు. రైతుల తర్వాత వెంటనే కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ మీద పోరాటం చేయాలని భావించింది బీఆర్ఎస్. ఈ నెలలో ఆ సభ నిర్వహిస్తారని మొదట చెప్పినా?. ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. అలా ఎందుకంటే? ప్లానింగ్ మారింది, డిఫరెంట్‌గా ఉండబోతోందన్నది పార్టీ వర్గాల ఆన్సర్. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి తమ దగ్గర ఉన్న ప్రధాన ఆయుధం వారిచ్చిన హామీలు, గ్యారంటీలే అన్నది బీఆర్ఎస్ భావన. వాటిని అమలు చేయలేదని నిరూపించడమే తమకు ప్రధానం అంటున్నారు గులాబీ సీనియర్స్. అలాంటి ఆయుధాన్ని వెంట వెంటనే వాడేస్తే? ఎన్నికల నాటికి వాడకం కోసం ఏమీ మిగలవని, అధికార కాంగ్రెస్‌పై పోరాటానికి వీటిని పద్ధతిగా వాడాలని డిసైడయ్యారట.మొత్తాన్ని ఒకేసారి ఉపయోగించకుండా? మెల్లిగా, టైం చూసి ఒక్కొక్క అస్త్రాన్ని బయటికి తీసి ప్రభుత్వం మీద ప్రయోగించాలనుకుంటున్నట్టు సమాచారం.యూత్ డిక్లరేషన్‌పై పోరాటాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలుస్తోంది. ఒక డిక్లరేషన్‌పై పోరాట సభకు, మరో దానికి మధ్య కనీసం ఆరు నెలల గ్యాప్ ఉంటే బాగుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారట. అందుకోసమే రైతు డిక్లరేషన్ పై పోరాటం సక్సెస్ అయిన ఈ సమయంలో వచ్చే ఐదారు నెలలు దాని గురించే మాట్లాడుకునేలా చేసి అదే అంశాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని.. తర్వాత యూత్ డిక్లరేషన్, దాని తర్వాత బీసీ డిక్లరేషన్ లాంటి అంశాలను తీసుకోవాలనుకుంటున్నట్టు సమాచారం. ముందు ఒక కార్యక్రమం చేసి? ఆ హీట్ తగ్గకుండా జాగ్రత్తపడుతూ? అది కాస్త తగ్గుతుందనుకున్నప్పుడు మరో అస్త్రాన్ని బయటికి తీసి ఆ టెంపోని అలాగే మెయిన్‌టెయిన్ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. ప్రతిపక్ష పార్టీగా?. ప్రభుత్వం మీద పోరాటానికి కలిసి వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోకూడదన్నది బీఆర్ఎస్ భావన. ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నందున ఆరు నెలలకో పెద్ద బహిరంగ సభ పెట్టి డిక్లరేషన్స్ మీద పోరాటాలకు సిద్ధమవుతోంది కారు పార్టీ. దాన్ని అలా కొనసాగిస్తే? ఎన్నికల నాటికి బాగా ఉపయోగపడుతుందని లెక్కలేస్తున్నారు.

# గ్రేటర్ లో టీడీపీ పోటీ...

హైదరాబాద్, జూన్ 8, (న్యూస్ పల్స్)ఎన్నికల్లో టిడిపి పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీని ఉద్దేశించి టిడిపి అక్కడ యాక్టివ్ అయ్యేందుకు అన్ని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన నేతలంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు సమాచారం. పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తమ ప్రతిపాదనను చంద్రబాబు ఎదుట పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారట చంద్రబాబు. ప్రస్తుతం అక్కడ పార్టీకి నాయకత్వం లేదు కానీ.. క్యాడర్ ఇప్పటికీ కొనసాగుతోంది. టిడిపి అభిమానులు కూడా ఎక్కువే. గ్రేటర్ తో పాటు సెటిలర్స్ ఉన్న జిల్లాలు చాలా ఉన్నాయి. అటువంటి చోట్ల మాత్రం టిడిపి పేరు ప్రముఖంగా వినిపిస్తూనే ఉంటుంది.మొన్న తెలంగాణలో పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పదివేల కోట్ల రూపాయల నిర్మాణాలకు సంబంధించి హైదరాబాదులో శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. చంద్రబాబుతో అయితే గంటల తరబడి చర్చించారు. అయితే దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి నడుస్తోంది మూడు పార్టీలతో. తెలంగాణలో సైతం మూడు పార్టీలు ఏకతాటి పైకి వస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ఉంది. అయితే గతంలో మాదిరిగా ప్రత్యేక రాష్ట్ర భావన లేదు. ఇప్పుడు అంతా అభివృద్ధి అజెండాగా సాగుతోంది తెలంగాణ రాజకీయం. తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేసేందుకు ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర పెద్దల ఆదేశాలతో గ్రేటర్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య పొత్తు ఉండబోతుందనేది ఒక అంచనాతెలుగుదేశం పార్టీకి తెలంగాణలో బలమైన కేడర్ ఉంది. ఎందుకంటే ఆ పార్టీ పుట్టింది తెలంగాణలో. ఎన్టీఆర్ బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. అవి తెలంగాణలో ఎక్కువగా నాటుకున్నాయి కూడా. మధ్యలో ప్రత్యేక రాష్ట్రం వాదంతో తెలుగుదేశం కాస్త ఇబ్బంది పడింది. ప్రతి దానికి చంద్రబాబు బూచి ని చూపించి రాజకీయం చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరకాలం దాటుతున్న క్రమంలో క్రమేపి ప్రాంతీయ వాదం బలహీనపడుతోంది. అభివృద్ధి మంత్రం పతాక స్థాయికి చేరుకుంటుంది. అందుకే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి నడుస్తాయన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు ఎక్కువగా టిడిపి నుంచి వెళ్లిన వారి.

# సింగరేణి సివిల్ కాంట్రాక్టు రిజిస్ట్రేషన్ ఎఫ్‌డీఆర్' మాయాజాలం!




### అధికారుల కళ్లుగప్పి నగదు డ్రా చేస్తున్న కొందరు కాంట్రాక్టర్లు
### యోనో (జూబో) యాప్ ద్వారా సెక్యూరిటీ డిపాజిట్లకు కన్నం
### నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు.. చర్యలకు డిమాండ్

రుద్రంపూర్, జూన్ 08 : సింగరేణి సంస్థలో సివిల్ కాంట్రాక్ట్ రిజిస్ట్రేషన్ల పేరుతో కొందరు కాంట్రాక్టర్లు భారీ మాయాజాలానికి తెరలేపారు. బ్యాంక్ యాప్‌లను ఆసరాగా చేసుకుని నకిలీ డిపాజిట్లతో సంస్థను నిలువునా ముంచేస్తున్నారు. భవిష్యత్‌లో కాంట్రాక్టర్లు ఏవైనా అవకతవకలకు పాల్పడితే రికవరీ చేయాల్సిన సెక్యూరిటీ డిపాజిట్లు.. కేవలం అధికారుల బీరువాల్లో కాగితాల రూపంలోనే మిగులుతుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తోందని తోటి కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు.సింగరేణి సంస్థలో సివిల్ పనులు దక్కించుకోవడానికి కాంట్రాక్టర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా నిర్దేశిత క్లాస్ ఆధారంగా సెక్యూరిటీ డిపాజిట్‌ను ఎఫ్.డి.ఆర్ (ఈఆఖీ) రూపంలో బ్యాంక్ నుండి పొంది అధికారులకు సమర్పించాలి.

క్లాస్ 1: రూ.5 లక్షలు
క్లాస్ 2: రూ.3 లక్షలు
క్లాస్ 3: రూ.1.5 లక్షలు
క్లాస్ 4: రూ.75 వేలు


ఈ నగదును సెక్యూరిటీ డిపాజిట్ కింద అధికారులు భద్రపరుస్తారు. అయితే, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ చేతికి రాగానే కొందరు కిలాడీ కాంట్రాక్టర్లు తమ బుద్ధిని చూపిస్తున్నారు. ఎస్బీఐ 'యోనో' (ాఃఎ జూబొ) యాప్ ద్వారా బ్యాంకులో ఉన్న సదరు ఎఫ్డీఆర్ నగదును వెనక్కి డ్రా చేసేసుకుంటున్నారు. దీంతో సింగరేణి సివిల్ అధికారుల బీరువాల్లో కేవలం 'జీరో బ్యాలెన్స్' ఉన్న కాగితాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి.గతంలో (ఆగస్టు 7, 2024న) కొత్తగూడెం ఏరియాలో సరిగ్గా ఇలాంటి మోసమే వెలుగుచూసింది. ఒక కాంట్రాక్టర్ యోనో యాప్ ద్వారా ఎఫ్డీఆర్ నగదును విత్ డ్రా చేసుకోగా, తోటి కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. అయినా అధికారుల తీరులో మార్పు రాలేదని తెలుస్తోంది. ఇటీవల కూడా ఓ కాంట్రాక్టర్ ఈ వ్యవహారంపై విజిలెన్స్ జీఎం, ఫైనాన్స్ జీఎం, మరియు డైరెక్టర్ ఆపరేషన్లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.కాంట్రాక్టర్లకు కొత్త పనులను కేటాయించే సమయంలో ప్రతిసారీ వారి రిజిస్ట్రేషన్ ఎఫ్డీఆర్ సజీవంగా ఉందా? లేదా? అని సరిచూసుకోవాల్సిన కనీస బాధ్యత సివిల్ అధికారులపై ఉంది. కానీ, ఆ దిశగా తనిఖీలు నిర్వహించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల ఈ పర్యవేక్షణా లోపమే అక్రమార్కులకు వరంగా మారింది.ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి, ప్రస్తుతం సివిల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లందరి ఎఫ్డీఆర్ స్టేటస్‌లను బ్యాంకు ల ద్వారా ఆన్‌లైన్‌లో తనిఖీ చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడుతూ సంస్థను తప్పుదోవ పట్టిస్తున్న కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సింగరేణి కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.సింగరేణి సంస్థలో ఏ చిన్న పొరపాటు లేదా అవినీతి అక్రమాలు జరిగినట్లు సమాచారం వచ్చినా.. క్షణాల్లో వాలిపోయి తనిఖీలు చేపట్టే విజిలెన్స్ (నిఘా) విభాగం, ఈ భారీ 'ఎఫ్డీఆర్' స్కామ్‌లో ఎందుకు మౌనంగా ఉందనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టుల రిజిస్ట్రేషన్లలో ఇంత పెద్ద మాయాజాలం జరుగుతున్నా, దీనిపై ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినప్పటికీ విజిలెన్స్ అధికారులు స్పందించకపోవడం వెనుక ఉన్న మర్మమేంటని తోటి కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై నమస్తే తెలంగాణ సివిల్ జీఎం వెంకటేశ్వరరావును వివరణ కోరగా తమ దృష్టికి ఒక కాంట్రాక్టర్ విషయం వచ్చిందని వారిపైన చర్యలు తీసుకున్నామని. మిగతా ఎఫ్ డి ఆర్ విషయంలో బ్యాంక్ అధికారులకు రాతపూర్వకంగా విచారణ జరిపించాలని, లేఖను పంపించామని తెలిపారు

# పోచంపల్లి బ్యాంక్‌కు మూడు జాతీయ అవార్డులు




భూదాన్ పోచంపల్లి, జూన్ 08 : లక్నోలో జరిగిన జాతీయ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సమ్మేళనం(2026) లో పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు మూడు జాతీయ అవార్డులు లభించాయి. జూన్ 5 నుండి 7వ తేదీ వరకు లక్నోలో భారత్ రత్న సహకారిత సమ్మాన్ సంబంధించిన ప్రతిష్టాత్మకమైన అవార్డుల ప్రధానోత్సవం అట్టహాసంగా జరిగింది. పోచంపల్లి బ్యాంకుకు బెస్ట్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, బెస్ట్ చైర్మన్ ఆఫ్ ద ఇయర్ తడక రమేష్, బెస్ట్ ఎన్ పి ఏ మేనేజ్‌మెంట్ అవార్డులను లక్నో ఎమ్మెల్యే పూకాన్ చేతుల మీదుగా బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్ అందుకున్నారు. పోచంపల్లి బ్యాంక్ మూడు జాతీయ అవార్డు అందుకోవడం పట్ల ఖాతాదారులు, వాటాదారులు, పలువురు నాయకులు, బ్యాంక్ సిబ్బంది పాలకవర్గ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సురపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నరసింహ పాల్గొన్నారు.

# రేవంత్ పాలన హిట్లర్ పాలనకు నిదర్శనం :
## బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్



హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రజాపాలన కాదని నిజమైన హిట్లర్ పాలన కు రేవంత్ రెడ్డినిదర్శనమని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పాలనపై విరుచుకు పడ్డారు.హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రా పెట్టానని, గాజా-ఇరాన్ తరహాలో పేదల ఇండ్లు కూల్చామని స్వయంగా ఒప్పుకున్న వ్యాఖ్యలపై ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేస్తే తమపై కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులకు పాల్పడుతున్నారని ఇది ప్రజాస్వామ్య పాలన కాదు. ఇది నిజమైన హిట్లర్ పాలనకు నిదర్శనమని ఆరోపించారు.హిట్లర్ చేసిన తప్పులకు జర్మనీ ప్రజలు ఇప్పటికీ క్షమాపణ చెబుతూనే ఉన్నారని, అలాంటి వ్యక్తి రేవంత్ రెడ్డికి స్ఫూర్తి అని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.2015 నుంచి ఇప్పటి వరకు కంటోన్మెంట్‌కు ఎన్నికలు నిర్వహించకుండా బీజేపీ నాయకులు నామినేటెడ్ సభ్యులను నియమిస్తు వస్తుందని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల విషయంలో ఆ పార్టీకి చెందిన నాయకుల మధ్య గొడవలు పడుతూ ఎన్నికలు నిర్వహించడం లేదని విమర్శించారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీకి చెందిన మరో ఎంపీ బ్యానర్లు కట్టిస్తున్నాడని , కంటోన్మెంట్ఇంత నిర్లక్ష్యం ఎందుకని ఈటలను ప్రశ్నించారు.

# ఫిలిప్పీన్స్‌లో భూకంపం..
### నలుగురు మృతి..
### 200 మందికి గాయాలు..
### సునామీ హెచ్చరికలు జారీ

ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంప ప్రభావంతో నలుగురు మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్‌లో భూంకపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ ఏడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనలర్ శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది.భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా బిల్డింగులు, రోడ్లు, బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారు అనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటిస్పష్టతా లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థుల్ని ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.




# అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటున్న ఇండియా, పాక్ : ఎస్ఐపీఆర్ఐ రిపోర్టు

న్యూఢిల్లీ: 2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టట్యూట్(ఎస్ఐపీఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వారహెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది.భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే మిస్సైళ్లు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలాంతర్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు మిస్సైళ్ల కోసం మరికొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారు చేస్తున్నట్లు సిప్రి తన రిపోర్టులో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటేనర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్టులో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది. చైనాపై ఫోకస్‌తో ఇండియాన తన లాంగ్ రేంజ్ వెపన్ సిస్టమ్‌లను తయారు చేసుకుంటున్నట్లు రిపోర్టులో తెలిపారు. దీంతో పాటు పాకిస్థాన్‌తో ఉన్న శత్రుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ఇండియా తన ప్లానింగ్ చేస్తున్నట్లు సిప్రి నివేదికలో చెప్పారు.ఇక పాకిస్థాన్ అణ్వాయుధాల రిపోర్టును సిప్రి ప్రజెంట్ చేసింది. అయితే జనవరి 2026 నాటికి పాకిస్థాన్ తన న్యూక్లియర్ నిల్వలను స్థిరంగా ఉంచినట్లు పేర్కొన్నది. ఆ దేశం వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ల్యాండ్, ఎయిర్ సామర్థ్యంలో బాగానే ఉన్నా.. సముద్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నది. అయితే రాబోయే దశాబ్ధంలో తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకోనున్నదని రిపోర్టులో పేర్కొన్నారు.జనవరి 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,187 అణ్వాయుధాలు ఉన్నట్లు స్టాక్‌హోమ్ సంస్థ తెలిపింది. మిలిటరీ వద్ద 9745 ఆయుధాలు ఉన్నాయని ఆ రిపోర్టులో చెప్పారు. ఇక 4012 మాత్రం క్షిపణులు, ఎయిర్‌క్రాఫ్ట్ లో నిక్షిప్తం చేశారు. రష్యా, అమెరికా దేశాలు సుమారు 2200 ఆయుధాలను హై అలర్ట్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత్, చైనా దేశాలు కూడా హై ఆపరేషనల్ అలర్ట్‌లో వార్‌హెడ్స్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ దేశాల వద్ద ఎంఐఆర్వీ టెక్నాలజీ ఆయుధాలు ఉన్నాయి. ఇక ఇండియా, పాక్, ఉత్తర కొరియా ఆ టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఎంఐఆర్వీ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని భావిస్తున్నారు. ఇండియా కూడా ఇటీవల అగ్ని-5 మధ్యంతర క్షిపణి ద్వారా ఎంఐఆర్వీ టెక్నాలజీని పరీక్షించింది. మరోవైపు పాక్ మీడియం రేంజ్ క్షిపణులను డెవలప్ చేస్తున్నది.



# నెతన్యాహుకు వేరే ఛాన్స్ లేదు.. ఇరాన్‌తో ఒప్పందానికి అంగీకరించాల్సిందే : డొనాల్డ్ ట్రంప్

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు ( డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టంచేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ చెప్పారు. ఇక్కడ తానే అన్ని నిర్ణయాలు తీసుకుంటానని, నెతన్యాహు కాదని అన్నారు. భవిష్యత్తులో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందేనని ట్రంప్ వ్యాఖ్యానించారు.కాగా ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది.ఇలాంటి సైనిక చర్యలవల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ.. 'మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి' అని పిలుపునిచ్చారు. అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు.తాము ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నామని, ఒకవేళ ఇరాన్ వినకపోతే వారిపై బాంబులతో విరుచుకుపడతామని ఎన్‌బీసీ న్యూస్ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలతోపాటు సైనిక ఒత్తిడిని కూడా కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.



# 'ఈ 10న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలి'
### సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు



దామరచర్ల, జూన్ 08 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి సమావేశం కామ్రేడ్ డి.లింగా నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా బంటు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 10వ తేదీన నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు ఇప్పటికీ ఆరుసార్లు పెంచడంతో సామాన్య ప్రజలకు గుదిబండగా మారిందన్నారు.రైతు కొనే అడుగు పిండి బస్తాకు రూ.300 నుండి 400 పెంచడం వల్ల, యూరియా ఆన్‌లైన్ యాప్ ద్వారా బుకింగ్ చేయాలంటే 60 శాతం రైతులకు ఆ యాప్ గురించి అవగాహన లేకపోవడంతో రైతులు యూరియా గురించి అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ యాప్ ని రద్దుచేసి రైతులకు అధికారుల ద్వారా నేరుగా యూరియా అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి డి.శాంత, మండల సమితి సభ్యులు జమ్ముల కోటయ్య, భాగం శేషయ్య, జి.శ్రీనివాస్ రెడ్డి, పి.లక్ష్మయ్య, వెంకన్న, వేణు పాల్గొన్నారు.

# ప్రతి 12 కొత్త వాహనాల్లో ఒకటి ఎలక్ట్రిక్

హైదరాబాద్, జూన్ 8, (న్యూస్ పల్స్)తెలంగాణలో 2025-26 ఫైనాన్షియల్ ఇయర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది రిజిస్టర్ అయిన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాల్లో 91,637 ఎలక్ట్రిక్ వాహనాలే (8.6 శాతం). అంటే ప్రతి 12 వాహనాల్లో ఒకటి ఈవీ కావడం విశేషం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సగానికి పైగా వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 769.81 కోట్ల జీవితకాల పన్ను మినహాయింపులను అందించడం ఈ వృద్ధికి కీలక దోహదకారిగా నిలిచిందని నిపుణులు చెబుతున్నారు.తెలంగాణలో పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థ దిశగా అడుగులు శరవేగంగా పడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2025-26) లో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ కాలంలో మొత్తం 91,637 ఎలక్ట్రిక్ వాహనాలు రవాణా శాఖ వద్ద నమోదయ్యాయి. ఈ ఏడాది రాష్ట్రంలో నమోదైన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాలలో ఇవి ఏకంగా 8.6 శాతం వాటాను దక్కించుకోవడం విశేషం. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. తెలంగాణలో రిజిస్టర్ అయిన ప్రతి 12 కొత్త వాహనాలలో ఒకటి ఖచ్చితంగా ఎలక్ట్రిక్ వాహనమేనని స్పష్టమవుతోంది.రాష్ట్రంలో వాహనాల కొనుగోలు సామర్థ్యం, సొంత వాహనాల వాడకం విపరీతంగా పెరుగుతున్న తరుణంలోనే ఈ ఈవీ విప్లవం కూడా ఊపందుకుంది. 2025-26 లో తెలంగాణ రోడ్లపైకి రికార్డు స్థాయిలో 10.62 లక్షల నూతన వాహనాలు వచ్చాయి. అంటే సగటున ప్రతిరోజూ దాదాపు 2900 కొత్త వాహనాలు రాష్ట్ర రవాణా నెట్‌వర్క్‌లో భాగమవుతున్నాయి. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, ప్రజల తలసరి ఆదాయం, వ్యయ సామర్థ్యం పెరగడం, విస్తరిస్తున్న పారిశ్రామిక కార్యకలాపాలు, ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిసరాల్లో వ్యక్తిగత ప్రయాణ సాధనాలకు పెరిగిన డిమాండ్ ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# పార్టీలకతీతంగా భూ దందాలు

నెల్లూరు, జూన్ 8, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గంలో రకరకాల భూ దందాలు జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఔట్స్ వేశారు. అప్పటి అధికారులను మేనేజ్ చేసుకుని మరికొందరు ప్రభుత్వ, కాలువ భూములను పట్టా భూములుగా చూపించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రధాన అనుచరుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి మీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. ఆయనతో పాటు మరో నలుగురు వేసిన లేఔట్లపై కూడా ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు జరుగుతోంది. అధికారులు లోతుల్లోకి వెళ్ళి దర్యాప్తు చేస్తుండటంతో అక్రమార్కులకు వణుకు పుడుతోందట. ఆ క్రమంలోనే? వాళ్ళు సరికొత్త ఆలోచనలకు పదునుపెట్టే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం కలకలం రేపుతోంది. గత ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి గెలిచాక వైసీపీ హయాంలో వేసిన అక్రమ లేఔట్లపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే ఇటీవల ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అది తుది దశకు చేరుకుందనుకుంటున్న సమయంలో దర్యాప్తు అధికారుల మీద దౌర్జన్యాలు జరగడం కలరలం రేపుతోంది. వీటి వెనక స్థానిక టిడిపి నేతలు ఉన్నారన్న మాటలతో ఇంకా షాకవుతున్నారట స్థానికులు. అసలు అక్రమ లేఔట్లపై దర్యాప్తు ప్రారంభించిన విజిలెన్స్ అధికారులకు మొదట రెవెన్యూ డిపార్ట్మెంట్ సహకరించలేదట. రికార్డులు ఇచ్చేందుకు కూడా కింది స్థాయి అధికారులు ఆసక్తి చూపలేదని తెలిసింది.చివరికి కలెక్టర్ ఆదేశాలతో రికార్డులు తెప్పించుకున్న విజిలెన్స్ అధికారులు సుమారు 78 లేఅవుట్లను పరిశీలించారు. ఇందులో చాలావరకు అక్రమాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో బయటపడిందని అంటున్నారు. ముగ్గురు వ్యక్తులు అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సుమారు 300 ఎకరాల్లో అక్రమ లేఔట్లు వేసినట్టు ప్రాథమిక అంచనాకి వచ్చారట. ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేశారని.. వాటి విలువ ఇప్పుడు 100 కోట్లకు పైనే ఉంటుందని దర్యాప్తు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో.. దీని నుంచి తప్పించుకునేందుకు అప్పట్లో అక్రమాలకు పాల్పడ్డ వాళ్ళంతా ఇప్పుడు టిడిపి ద్వితీయ శ్రేణి నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారన్న ప్రచారం కావలిలో కాక రేపుతోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల బండారం విజిలెన్స్ ఎంక్వయిరీలో బయటపడుతూ ఉండడంతో ?వాళ్ళంతా ఉలిక్కిపడుతున్నారట. ఎలాగైనా దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ నేతలకు టచ్ లోకి వెళ్లినట్టు చెప్పుకుంటున్నారు. ఆ టచ్చింగ్స్ కారణంగానే?. కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామకృష్ణ? విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని సొంత పార్టీలోనే మాట్లాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితంగా ఉన్న కీలక నేత ఒకరు.. ఇప్పుడు టిడిపి నేతలకు వెనకుండి గైడ్ చేస్తున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే అక్రమ లేఔట్లకు సంబంధించిన సూత్రధారులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు.. వారికి సహకరించిన రియలెస్టేట్ బ్రోకర్స్, డాక్యుమెంట్ రైటర్ల వివరాలు సేకరిస్తున్నారట. దొరికిన వాళ్ళ నుంచి స్టేట్మెంట్స్ రికార్డు చేసే కార్యక్రమం కూడా నడుస్తోందని అంటున్నారు.అయితే విజిలెన్స్ విచారణకు సహకరించొద్దంటూ బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌ను కూడా సదరు సదరు కీలక నేతే బెదిరిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. దర్యాప్తు పూర్తి చేసి నెలాఖరులోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులు గట్టిగా పనిచేస్తుంటే.. అది పూర్తయితే తమపై క్రిమినల్ కేసులు పెట్టే ప్రమాదం ఉందని అక్రమార్కులు భయపడుతున్నారట. అందుకే? ఎంక్వయిరీని ఆలస్యం చేసేందుకు.. స్థానిక ద్వితీయ శ్రేణి టిడిపి నేతలను రెచ్చగొట్టి అధికారులమీదకు పంపుతున్నారన్నది లోకల్ టాక్. మా లేఔట్స్ మీద విచారణ చేసే అధికారం ఎవరిచ్చారంటూ విజిలెన్స్ అధికారులను బెదిరించడం కూడా టిడిపి ద్వితీయ శ్రేణి నేతల ప్లాన్‌లో భాగమేనని, అక్రమార్కులే తెరవెనుక ఉండి వాళ్లని పురమాయిస్తున్నారన్న ప్రచారం కావలిలో జరుగుతోంది. టీడీపీ నాయకులు దాడి చేసిన వ్యవహారాన్ని ఇప్పటికే విజిలెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారట. సదరు నేతపై కేసు నమోదు చేసినప్పటికీ దీనికి సంబంధించి అటు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గానీ.. జిల్లా అధ్యక్షులు, అదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గాని నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని సొంత పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇన్ని ఆటంకాల మధ్య అక్రమ లేఔట్స్‌పై విజిలెన్స్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా..? అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతారా అనేది ఉత్కంఠ గా మారింది.

## కర్నూలులో వైసీపీ వర్సెస్ వైసీపీ



కర్నూలు,జూన్ 8, కర్నూలులో అధికార పార్టీ, ప్రతిపక్షం పోరు కాస్త..వైసీపీ వర్సెస్ వైసీపీ అన్నట్టు మారిపోయింది. టీడీపీలోని ఒక వర్గం పరోక్షంగా ప్రతిపక్ష నేతల మధ్య మంట పెట్టిందనే ప్రచారం జరుగుతున్న వేళ..కర్నూలు వైసీపీలో అంతర్గత పోరు వీధికెక్కుతోంది. ఏకంగా సోషల్ మీడియా వేదికగా నాయకులు దుమ్మెత్తి పోసుకోవడం హాట్ టాపిక్ అవుతుంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్ మధ్య సోషల్ మీడియా వార్ ఒక రేంజ్‌లో నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ కర్నూలు సీటు మైనారిటీకి వెళ్తుందని ఎస్వీ మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని.. టీడీపీ కన్న వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ వర్గం తనపై కక్ష కట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు అహ్మద్ ఖాన్వారం పది రోజుల క్రితం కర్నూలు వేదికగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎస్వీ మోహన్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మధ్య మాటలు మంటలు చెలరేగాయి. అవి అలా చల్లారాయో లేదో ఇప్పుడు వైసీపీలో అంతర్గత పోరు కాక రేపుతోంది. పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడితో, ఎస్వీ మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా ఫోన్‌లో మాట్లాడిన మాటలు ఇప్పుడు బయటికి వచ్చాయి. వాయిస్ రికార్డ్ చేసిన ఐటీడీపీ ప్రతినిధి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అంతకు ముందు కర్నూలులో ఎస్వీ మోహన్ రెడ్డి, జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేసిన ఆందోళన విషయంలో కూడా అహ్మద్ ఖాన్ ఎస్వీకి వ్యతిరేకంగా కామెంట్స్ చేశారు. ఆయన వైసీపీలో వెనుకబడ్డారని, దాన్ని నిలబెట్టుకోడానికి నానా తంటాలు పడుతున్నాడని అహ్మద్ ఖాన్ అన్నట్లుగా చెబుతున్నారు.కర్నూలులో వైసీపీ చేపట్టిన ఆందోళనలో జక్కంపూడి రాజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాత్రమే హైలైట్ అయ్యారంటూ ఐటీడీపీ ప్రతినిధితో ఫోన్ కన్వర్జేషన్‌లో మాట్లాడారు వైసీపీ నగర అధ్యక్షుడు అహ్మద్ ఖాన్. ఎస్వీ మోహన్ రెడ్డి వన్ మ్యాన్ షో చేస్తున్నారంటూ సొంత పార్టీ నేతపై నెగెటివ్ కామెంట్స్ చేశారాయన. సరిగ్గా ఈ పాయింట్స్‌నే తమకు అనుకూలంగా మల్చుకునేందుకు టీడీపీ వ్యూహాలు రచిస్తోంది. వైసీపీలో అంతర్గత విభేదాలు గట్టిగా ఉన్నాయని ప్రాజెక్ట్ చేస్తూ..ఆడియో రికార్డ్‌ను పోస్ట్ చేసింది టీడీపీ సోషల్ మీడియా టీమ్. ఇదే ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలో మంటలు పుట్టిస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడికి వ్యతిరేకంగా కర్నూల్ నగర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలతో క్యాడర్లో అయోమయ పరిస్థితి ఏర్పడింది. అటు ఎస్వీకి చెందిన సోషల్ మీడియా టీమ్ కూడా అహ్మద్ అలీఖాన్ పేరు ప్రస్తావించకుండా కొన్ని పోస్ట్‌లు పెట్టడం కలకలం రేపుతోంది. మరికొందరు సోషల్ మీడియాలోనే అహ్మద్ అలీఖాన్‌ను నిలదీస్తున్నారు.కర్నూలు వైసీపీలో ముగ్గురు కీలక నేతలు యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, హఫీజ్ ఖాన్, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ మూడు గ్రూప్‌లు విడిపోయి యాక్టివిటీ నడిపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్ళు హఫీజ్ ఖాన్, ఎస్వీ మోహన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా పోరు మాత్రం ఆగడం లేదు. అది చాలదన్నట్లుగా అహ్మద్ ఖాన్ వాయిస్ రేజ్ చేయడంతో పాటు ఆయన ఆడియో కాల్ టీడీపీ సోషల్ మీడియా టీమ్‌కు చిక్కడం మరింత చర్చనీయాంశంగా మారింది. రాయలసీమకు ముఖద్వారంగా ఉన్నా కర్నూలు వైసీపీలో నడుస్తున్న అంతర్గత పోరుపై పార్టీ అధిష్టానం ఎలా రియాక్ట్ అవుతుందో వేచి చూడాలి మరి.

## దేవీపట్నం మండలంలో కొనసాగుతున్న పులి సంచారం

ఏలూరు దేవీపట్నం మండలం నెలకోట ఒ పూడిపల్లి సొరంగం వద్ద పులి సంచారం కొనసాగుతోంది. అటవీశాఖ, హనుమాన్ ప్రత్యేక బృందాలు రాత్రంతా నిఘా కొనసాగించాయి. క్షేత్రస్థాయిలో బృందాలకు ఉన్నతాధికారులు మార్గనిర్దేశం చేస్తున్నారు. × బెంగళూరు నుంచి వచ్చిన వన్యప్రాణి నిపుణుల బృందం ఆపరేషన్ లో భాగస్వామ్యమైయింది. రాత్రివేళ బయటకు ఒంటరిగా వెళ్లొద్దని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు సూచించారు.

## కార్గో వ్యతిరేక ఉద్యమం...

శ్రీకాకుళం,జూన్ 8, అసెంబ్లీ ఎన్నికల్లో పలాస నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు గౌతు శిరీష. ఇప్పుడు ఆమెకే నియోజకవర్గంలో సరికొత్త సమస్యలు ఎదురవుతున్నాయట. పార్టీ పవర్‌లో ఉండటం, తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన, జిల్లా వాసి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ఉండటంతో పలాసకు ఓ మంచి ప్రాజెక్ట్ తీసుకురావాలని భావించారట ఎమ్మెల్యే. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయటంతో పాటు ఉపాధి అవకాశాలు సృష్టించేలా ప్రాజెక్ట్ కోసం ప్రయత్నించారామె. ఆ క్రమంలోనే పలాస ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ పెట్టాలని నిర్ణయించారు. ఇక్కడికి ఆ ప్రాజెక్ట్ వస్తే ఉద్దానం ప్రాంతం అభివృద్ధి అవుతుందంటూ ప్రచారం మొదలు పెట్టారు. అందుకు అవసరమైన భూ సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేగా గౌతు శిరీష కూడా స్థానికులతో మాటాడే ప్రయత్నం చేస్తున్నారట. కానీ పాలకులు చెబుతున్న అభివృద్ధి మాటల్ని స్థానికులు విశ్వసించడం లేదు. పైగా పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక ఉద్యమం మొదలైంది. మాకసలు అది వద్దే వద్దంటూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సమావేశాల్లో సైతం మా ప్రాంతానికి కార్గో ఎయిర్‌పోర్ట్ అవసరం లేదని చెప్పేస్తున్నారు. అందుకు వాళ్ళ రీజన్స్ వాళ్ళకు ఉన్నాయి. పెద్దగా ఉపాధి అవకాశాలు ఇవ్వని కార్గో ఎయిర్ పోర్టు కోసం వేలాది ఎకరాల్లో ఉన్న జీడి, కొబ్బరి, మామిడి తోటల్ని పణంగా పెట్టేలేమన్నది స్థానిక రైతుల మాట. దీని గురించే ఇప్పుడు పలాసతో పాటు శ్రీకాకుళం జిల్లాలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలోని పల్లెల్లో చాపకింద నీరులా కార్గో వ్యతిరేక ఉద్యమం విస్తరిస్తోంది. పచ్చని తోటల్ని కొట్టివేయడం తమకు ఇష్టం లేదని అంటున్నారు రైతులు. కొందరైతే కాస్త డిఫరెంట్‌గా, ఇంకాస్త గట్టిగా తమ వాదన వినిపిస్తున్నారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాక్టరీ లాంటిది ఏదైనా వస్తే? ఇష్టం లేకున్నా? భవిష్యత్ కోసం భూములు ఇస్తాంగానీ. కేవలం కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో పరిమితమైన ఉపాధి దక్కుతుందంటే అలాంటి ప్రయోజనం లేని త్యాగాలకు మేం సిద్ధంగా లేమని తెగేసి చెబుతున్నారు. పైగా మా భూమిని లాక్కుని భూ బ్యాంక్ సిద్ధం చేసుకుంటామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని అంటున్నారు.ఈ వ్యవహారం మొత్తం అటుచేరి ఇటు చేరి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు చుట్టుకుంటోందట. దశాబ్దాలుగా గౌతు ఫ్యామిలీకి అండగా నిలుస్తున్నారు ఇక్కడి ప్రజలు. సర్దార్ గౌతు లచ్చన్నకు ఉన్న పేరు గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. ఆయన కుమారుడు గౌతు శివాజీ సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేయటంతో పాటు, మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కానీ? శివాజీ కుమార్తె అయిన శిరీషకు రాజకీయ పరిణితి లోపించిందని, ప్రజల మనోగతాన్ని తెలుసుకోలేకపోతున్నారన్న మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా వెళితే? వాళ్ళకు మంచి చేయాలనుకోవడం ఏమోగానీ? భవిష్యత్‌లో ఇబ్బందులు మాత్రం తప్పవంటూ టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులే హెచ్చరిస్తున్నారు. దీనిపై వైసీపీ కూడా ప్రశ్నాస్త్రాలు సంధిస్తోంది. మూలపేట పోర్ట్ దగ్గర వేలాది ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నప్పుడు దానికి దగ్గర్లోనే? ఇలా మరో భూ సేకరణ అవసరమా అన్నది ఫ్యాన్ క్వశ్చన్. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే కూడా ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టు తెలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా? తమ ప్రాంతానికి వచ్చిన ప్రాజెక్ట్ విషయంలో అడుగు ముందుకేయాలా? లేక ప్రజాభీష్టం పేరుతో ఆపేయాలో అర్థంగాక గందరగోళంలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

## సైలెంట్ మూడ్ లోకి ఫైర్ బ్రాండ్లు

కడప,జూన్ 8,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కొనసాగుతోంది. ఎవరి వల్ల పార్టీకి చెడ్డ పేరు వచ్చిందో.. వారు ఇప్పుడు యాక్టివ్ అవుతున్నారు. పార్టీలో సీనియర్లు సైలెంట్ అవుతున్నారు. ఈ భిన్న వాతావరణంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. 2019 నుంచి 2024 మధ్య కొంతమంది నేతల వ్యవహార శైలితోనే పార్టీకి ఈ రకమైన ఇబ్బందులు వచ్చాయి. ప్రారంభంలో వారి మాటలు గొప్ప ఫ్యాషన్ గా అనిపించాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సైతం ఆకర్షించాయి. కానీ రాను రాను ఆ నేతల తీరుతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతనస్థితికి చేరుకుందనేది పార్టీ క్యాడర్ కు తెలిసింది. పార్టీలో సీనియర్లు మౌనం వహించి.. దూకుడు కలిగిన నేతలు మాటలు పార్టీకి చేటు తెచ్చాయి అని ఆలస్యం గా తెలిసింది. అప్పటికే మూల్యం చెల్లించుకుంది పార్టీ. అయితే ఇప్పుడు క్యాడర్ తెలుస్తుంది కానీ.. నాయకత్వం తెలుసుకోకపోవడం పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లుగా గుర్తింపు సాధించారు కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, పేర్ని నాని, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, జోగి రమేష్, గుడివాడ అమర్నాథ్, సిదిరి అప్పలరాజు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది జూనియర్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడేవారు. వారి మాటలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎంతో ఇష్టంగా ఉండేవి. అయితే వారి మాటలు తటస్థులతోపాటు విద్యాధికులపై విపరీతంగా ప్రభావం చూపించాయి. ఫలితమే 2024 ఎన్నికల్లో దారుణ పరాజయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేటు తెచ్చిన ఆ దూకుడు నేతలను జగన్మోహన్ రెడ్డి పక్కన పెట్టినట్లు కనిపించారు ప్రారంభంలో. గత అనుభవాల దృష్ట్యా సీనియర్ల సేవలను వినియోగించుకుంటానని జగన్ చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే సీనియర్లుగా ఉన్న ధర్మాన, బొత్స లాంటి నేతలు మాట్లాడడం ప్రారంభించారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని అంతా భావించారు. కానీ ఆ సరదా ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. ఎవరైతే బూతులు మాట్లాడారో.. అడ్డగోలుగా వ్యవహరించారో.. అటువంటి నేతలు మళ్లీ తెరపైకి వస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి వారికి ప్రాధాన్యమిస్తున్నట్టు కనిపిస్తున్నారు. దీంతో సీనియర్లుగా ఉన్న ధర్మాన లాంటి వారు మళ్లీ మౌనం పాటిస్తున్నారు. ఇలా అయితే కష్టమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిట్టూరుస్తున్నారు.



## అమరావతి కోసం వైసీపీ లీగల్ ఫైట్...

విజయవాడ,జూన్ 8, (న్యూస్ పల్స్)అమరావతిలో రాజధాని నిర్మాణం ఒక ఎత్తయితే? అందుకోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలు మరోఎత్తు. ఒకవైపు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే? ఇంకోవైపు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు, రెండో విడత భూ సమీకరణకు సంబంధించిన సమస్యలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. సరిగ్గా ఇక్కడే కొత్త అస్త్రాలకు పదును పెడుతోందట ప్రతిపక్ష పార్టీ. బాధిత రైతుల తరపున వైసీపీ డైరెక్ట్‌గా యాక్షన్‌లోకి దిగే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తోంది. దానికి సంబంధించి ఆగమేఘాల మీద పార్టీ తరపున ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడమే ఇందుకు ఉదాహరణ అంటున్నారు పరిశీలకులు. రాజధాని ప్రాంతానికి చెందిన కొందరు రైతులు తాజాగా వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిశారు. వాళ్ళు తమ సమస్యల్ని చెప్పిన వెంటనే పార్టీ కమిటీలు ఏర్పాటవడం చూస్తుంటే? ఈ విషయంలో విపక్షం ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతోందని అంటున్నారు ఈ వ్యవహారాలను దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు. అమరావతి రైతుల సమస్యల్ని క్షేత్రస్థాయి పరిశీలించడం కోసం పార్టీ తరపున కీలకమైన సీఆర్డీఏ కమిటీ ఏర్పాటైంది. బలవంతపు భూ సమీకరణకు తాము వ్యతిరేకమని.. తాము అధికారంలోకి వచ్చాక అవసరమైతే భూముల్ని తిరిగి ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని జగన్ చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.ప్రభుత్వం చెబుతున్నట్టు అమరావతిలో అంతా పారదర్శకంగా ఏమీ లేదని, చాలా మందికి తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైసీపీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని అంటున్నారు. 400 మందికి పైగా రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంకా కేటాయించాల్సి ఉందని చెప్పుకుంటున్నారు. కొన్ని భూములపై కోర్టు కేసులు కొనసాగుతుండగా.. వాటి పరిష్కారం తర్వాతే ప్లాట్లు కేటాయిస్తామని అంటోందట ప్రభుత్వం. లంక భూములకు సంబంధించిన సమస్యలు కూడా ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని తెలుస్తోంది. రెండు వేలకుపైగా ప్లాట్లు వివిధ కోర్టు వివాదాల్లో ఉన్నాయనే చర్చ కూడా జరుగుతోంది. ఇలా అధికారికంగా వెలుగులోకి వచ్చిన సమస్యలతో పాటు.. బయటకు రాని ఇబ్బందులు కూడా చాలానే ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కోర్టులకు వెళ్లే స్థోమత లేక.. ప్రభుత్వాన్ని ఎదిరించే ధైర్యం చాలని చాలామంది రైతులు తమ సమస్యలను బయటపెట్టలేకపోతున్నారని వైసీపీ నేతలు గుర్తించినట్లు సమాచారం. అలాంటి వారికి అండగా ఉండి న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని, అంబటి రాంబాబులతో పాటు దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, నందిగం సురేష్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబులకు ఈ కీలక కమిటీలో చోటు కల్పించారు. కోర్టుల్లో పోరాడేందుకు పార్టీ లీగల్ సెల్ నుండి పొన్నవోలు సుధాకర రెడ్డి లాంటి వాళ్ళను కూడా రంగంలోకి దించారు. ఇప్పటివరకు రాజధాని విషయంలో అధికార కూటమి వాదనలే ఎక్కువగా వినిపించాయని, అందుకే రైతుల సమస్యల పేరుతో వైసీపీ ప్రత్యామ్నాయ వేదికను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదటి విడతలో రిటర్నబుల్ ప్లాట్లు అందని రైతులు, రెండో విడత భూ సమీకరణలో సమస్యలు ఎదుర్కొంటున్న వాళ్ళు, కోర్టుల చుట్టూ తిరగలేని బాధితులు.. ఇలా అన్ని వర్గాల వాళ్ళను సపోర్ట్ చేయడమే ప్రతిపక్ష పార్టీ అజెండాగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అమరావతి రైతులు ఏం కోరుకుంటే అది చేస్తాం.. బలవంతపు భూసేకరణ అనేదే ఉండదు.. అవసరమైతే భూములు వెనక్కు ఇస్తాం. ప్రస్తుతానికి మనం చేయగలిగింది న్యాయ పోరాటం మాత్రమేనన్న జగన్ మాటల చుట్టూ గట్టి చర్చలే జరుగుతున్నాయి. ఇదే సమయంలో తమ మావిగన్ ప్రతిపాదన అయితే అమరావతి ప్రాంత రైతుల నుంచి మరోసారి భూములు తీసుకోవాల్సిన అవసరం ఉండదన్న వాదనను తెరపైకి తెస్తోంది వైసీపీ. మొత్తం మీద అమరావతి రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకుని వైసీపీ లీగల్ అస్త్రంతో డైరెక్ట్ వార్ డిక్లేర్ చేసినట్టేనన్నది విస్తృతాభిప్రాయం. భూ సమీకరణ బాధితులకు అండగా నిలవడం ద్వారా రాజధాని పేరుతో ప్రభుత్వానికి వస్తున్న మైలేజీకి బ్రేకులు వేయాలన్నది విపక్షం స్కెచ్‌గా కనిపిస్తోంది. మరి ఈ లీగల్ ఫైట్‌కు రైతులు కలిసి వస్తారా?? కూటమి ప్రభుత్వం ఎలాంటి కౌంటర్ ఉంటుందోనన్న ఆసక్తి పెరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో.

## రాజ్యసభ ఎన్నికల కోసం పక్కా వ్యూహం

విజయవాడ,జూన్ 8, ఏపీలో రాజ్యసభ లెక్క తేలింది. టిడిపి నుంచి ముగ్గురు.. జనసేన నుంచి ఒకరు ఖరారు అయ్యారు. టిడిపి నుంచి సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ పేరు ఖరారు చేశారు.టిడిపి అధినేత చంద్రబాబు రాజ్యసభ ఎన్నికలో పక్కా వ్యూహం అమలు చేసినట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలు, ప్రాంతాలవారీగా బ్యాలెన్స్ చేయడం, పార్టీకి ఉన్న నమ్మకమైన కేడర్ కు ప్రాధాన్యత ఇవ్వడం అనే అంశాల ఆధారంగా ఈ ముగ్గురి ఎంపిక జరిగింది. కాపు బీసీ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తూనే.. విద్యారంగంలో గుర్తింపు ఉన్న వ్యక్తులకు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన యువనాయకత్వానికి ఈసారి పెద్దపీట వేశారు. బిజెపి, జనసేన నాయకత్వంతో మాట్లాడిన తర్వాత మాత్రమే తుది నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు ఎంపిక వెనుక పార్టీ పట్ల విధేయత దాగి ఉంది. ముఖ్యంగా ముగ్గురు నారా లోకేష్ కు అత్యంత సన్నిహితులు కావడం విశేషంసానా సతీష్ కు మరోసారి కొనసాగింపు లభించింది. గత కొంతకాలంగా పార్టీలో ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. పారిశ్రామిక వ్యాప్తంగా కూడా గుర్తింపు ఉంది. నిత్యం నారా లోకేష్ వెంట ఉండేవారు. ఆయన పాదయాత్ర చేసిన సమయంలో కూడా కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. భాష్యం రామకృష్ణ తెర వెనుక రాజకీయ సేవలు అందిస్తూ వచ్చారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సహకారం అందించారు. మొన్నటి ఎన్నికల్లో గుంటూరు ఎంపీ టికెట్ ఆశించారు. కానీ వీలు పడలేదు. రాజ్యసభ పదవి దక్కింది. ఇక చింతకాయల విజయ్ గురించి చెప్పనవసరం లేదు. తండ్రి మాదిరిగానే దూకుడు కలిగిన నేత. ఐటీడీపీకి విశేష సేవలు అందించారు. ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వడం ద్వారా యువతకు, పార్టీ నమ్మకస్తులకు చంద్రబాబు సరైన గుర్తింపు ఇచ్చారని చర్చ జరుగుతోందిఈ ముగ్గురి ఎంపిక వెనుక ఉన్న అసలు వ్యూహం లోకేష్. పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మొన్న పొలిట్ బ్యూరోతో పాటు అన్ని రకాల కార్యవర్గాల్లో యువతను నియమించారు. ఇప్పుడు రాజ్యసభలో సైతం ఈ ముగ్గురు యువ నాయకులను తీసుకున్నారు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ కీలక నియామకం చేపట్టారు. ఉత్తరాంధ్ర నుంచి విజయ్ ను తీసుకోవడం విశేషం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం, యువనేత కావడంతో చివరి నిమిషంలో ఆయన వైపు మొగ్గు చూపారు చంద్రబాబు. మొత్తానికి అయితే సుదీర్ఘ కసరత్తు తరువాత చంద్రబాబు రాజ్యసభ సభ్యులను ఎంపిక చేయడం విశేషం.

# పుచ్చకాయ తిన్న వెంటనే ఈ పదార్థాలు తింటే అంతే సంగతులు.. ఆరోగ్య నిపుణులు హెచ్చరిక!



వేసవి వచ్చిందంటే చాలు... దాహార్తిని తీర్చే చల్లని పుచ్చకాయ గుర్తొస్తుంది. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి, శరీరాన్ని హైడ్రేట్ చేసుకోవడానికి పుచ్చకాయ ఒక అద్భుతమైన వరం. రుచికరంగా ఉండటమే కాదు, ఈ పండులో నీటి శాతం దాదాపు 92% వరకు ఉంటుంది. విటమిన్లు ం, అ, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలకు ఇది మంచి వనరు. గుండె ఆరోగ్యానికి, చర్మ సౌందర్యానికి, కంటి చూపుకు కూడా పుచ్చకాయ ఎంతో మేలు చేస్తుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది మంచి ఎంపిక. అయితే, ఇంత ఆరోగ్యకరమైన పుచ్చకాయను కూడా సరైన పద్ధతిలో తినకపోతే కొన్ని అనారోగ్య సమస్యలు తప్పవని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే, పుచ్చకాయ తిన్న వెంటనే కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతిని, కడుపు సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పుచ్చకాయ చాలా త్వరగా జీర్ణమయ్యే పండు. దీన్ని నెమ్మదిగా జీర్ణమయ్యే ఇతర పదార్థాలతో కలిపి తీసుకున్నప్పుడు కడుపులో అసౌకర్యం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. పుచ్చకాయ తిన్న వెంటనే ఏమేమి తినకూడదంటే: నీళ్లు తాగడం: పుచ్చకాయలో ఇప్పటికే నీటి శాతం చాలా ఎక్కువ. దీన్ని తిన్న వెంటనే మళ్ళీ నీళు తాగడం వల్ల కడుపులో నీటి నిల్వ మరింత పెరిగి, జీర్ణ ఎంజైమ్స్ పలుచబడిపోతాయి. దీనివల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి, పుచ్చకాయ తిన్న తర్వాత కనీసం 30 నిమిషాల వరకు నీళ్లు తాగడం మానుకోవాలి. పాల ఉత్పత్తులు: పుచ్చకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. పాల పదార్థాలు, పుచ్చకాయ కలిసినప్పుడు కడుపులో రసాయన ప్రతిస్పందన జరిగి, జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా లూజ్ మోషన్స్ వంటి సమస్యలు రావొచ్చు. అందుకే పుచ్చకాయ తిన్న తర్వాత కనీసం ఒక గంట లేదా రెండు గంటల వ్యవధి ఇచ్చి పాల ఉత్పత్తులు తీసుకోవడం మంచిది. ఖీవఇనీఎవనిటవట రంగంలోకి 26 రాఫెల్-ఓ ఫైటర్ జెట్లు"పోటీన్ అధికంగా ఉండే ఆహారాలు: పప్పులు, మాంసం, చేపలు వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. పుచ్చకాయ త్వరగా జీర్ణమై, కడుపులో నుంచి ముందుకు కదలడానికి సిద్ధంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో నెమ్మదిగా జీర్ణమయ్యే ప్రోటీన్ ఫుడ్స్ తీసుకుంటే, పుచ్చకాయ జీర్ణ క్రియకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది కడుపులో అజీర్ణం, పులియడం), గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. జిడ్డుగా ఉండే ఆహారాలు: వేపుళ్ళు, ఫ్రైడ్ ఫుడ్స్, మిఠాయిలు వంటి జిడ్డుగా ఉండే లేదా కొవ్వు అధికంగా ఉండే పదార్థాలు కూడా పుచ్చకాయ తిన్న వెంటనే తీసుకోకూడదు. కొవ్వు పదార్థాలు చాలా నెమ్మదిగా జీర్ణమవుతాయి. పుచ్చకాయ త్వరగా జీర్ణమయ్యే ప్రయత్నంలో ఉండగా, ఈ కొవ్వు పదార్థాలు జీర్ణ వ్యవస్థను మరింత నెమ్మదిస్తాయి. దీనివల్ల కడుపులో భారంగా అనిపించడం, అజీర్ణం, అసౌకర్యం వంటివి కలుగుతాయి. ఇతర పండ్లు: చాలామంది పండ్లను కలిపి తినడం చేస్తుంటారు. అయితే, పుచ్చకాయను ఎప్పుడూ విడిగా తీసుకోవడం ఉత్తమం అని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పుల్లగా ఉండే వండ్లు లేదా త్వరగా జీర్ణమయ్యే ఇతర పండ్లతో కలిపి వెంటనే తినకూడదు. వివిధ పండ్లు వేర్వేరు సమయాల్లో, వేర్వేరు రేట్లలో జీర్ణమవుతాయి. పుచ్చకాయ చాలా త్వరగా జీర్ణమవుతుంది. దీన్ని నెమ్మదిగా జీర్ణమయ్యే లేదా ఆమ్లత్వం ఎక్కువగా ఉండే పండ్లతో కలిపి తీసుకున్నప్పుడు కడుపులో పులియబెట్టే ప్రక్రియ జరిగి, గ్యాస్, కడుపు నొప్పి, అజీర్ణం వంటి సమస్యలు రావొచ్చు. పండ్లు తినేటప్పుడు ఒకే రకం పండు తినడం లేదా పుచ్చకాయ తిన్న తర్వాత కనీసం ఒక గంట వ్యవధి ఇవ్వడం ఉత్తమం. ఎంతో ఆరోగ్యకరమైన పుచ్చకాయను కూడా సరైన పద్ధతిలో తినకపోతే కొన్ని ఇబ్బందులు తప్పవు. పుచ్చకాయలోని పూర్తి ప్రయోజనా లను పొందాలంటే, అది తిన్న తర్వాత కనీసం 30 నిమిషాల నుంచి ఒక గంట వరకు ఏమీ తినకుండా ఉండటం మంచిది. ఈ చిన్న జాగ్రత్త పాటించడం వల్ల మీ జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది, పుచ్చకాయలోని పోషకాలు శరీరానికి పూర్తిగా అందుతాయి. పుచ్చకాయను ఆస్వాదిస్తూనే, ఈ జాగ్ర త్తలు పాటించి ఆరోగ్యంగా ఉండండి!

# నల్ల శనగల ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అసలే వదిలిపెట్టరు! ః

మన శరీర ఆరోగ్యానికి దోహదం చేసే ఆహారాలలో నల్ల శనగలు ఒకటి . నానబెట్టిన నల్లశనగలు ఒక వంద గ్రాములు కనుక మీరు తిన్నట్లయితే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడి కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు . అంతేకాదు మీ శరీరానికి కావలసిన అన్ని రకాల ప్రోటీన్లు ఈ నల్ల శనగలలో పుష్కలంగా ఉండటం వలన అలసట రాదు. నల్ల శనగలతో ఆరోగ్యం అధిక బరువుతో, చెడు



కొలెస్ట్రాల్ కలిగి ఇబ్బంది పడుతున్న వారికి సన్న బడటానికి, అధిక బరువుతో పాటు కొలెస్ట్రాల్ తగ్గడానికి నానబెట్టిన నల్ల శనగలు బాగా దోహదపడతాయి. మలబద్ధక నివారణకు మంచి ఉపయోగం ఉంటుంది. నల్ల శనగలలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. రోజు ఒక అరకప్పు నానబెట్టిన నల్ల శనగలు ఒక వారం రోజుల పాటు క్రమం తప్పకుండా తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యం, బ్లడ్ షుగర్ కు నల్ల శనగలు నల్ల శనగలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మిటమిన్ బీ 6, మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉండి మెదడు మరియు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచటం కోసం నల్ల శనగలు ఉపయోగపడుతున్నాయి. బ్లడ షుగర్ ని నియంత్రించేందుకు నల్ల శనగలు అత్యద్భుతంగా పనిచేసే మంచి ఆహారంగా చెప్పుకోవచ్చు. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలకు ఉపశమనం కలుగుతుంది.. ముఖ్యంగా మల బద్ధకంతో బాధపడేవారికి మంచి ఫలితాలు ఉంటాయి.. నల్ల శనగలతో ఈ లాభాలు కూడా నల్ల శనగలతో గుండెకు రక్త ప్రసరణ బాగా జరిగి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. నరాల బలహీనత ఉన్న వారికి దివ్య ఔషధంగా ఇది ఉపయోగపడుతుంది. ఎన్నో మానసిక సమస్యలకు, నరాల బలహీనత, నరాల సమస్యలకు నల్ల శనగలు ఉపయుక్తం. నానబెట్టిన నల్ల శనగలు తింటే మంచి రిజల్ట్ వస్తుందని చెప్తున్నారు. ఖీవఇనీఎవనిటవట ఈనీతీ జనీబీ "పాకిస్థాన్ కు బిగ్ షాక్.. రంగంలోకి 26 రాఫెల్-ఓ ఫైటర్ జెట్లు" 2-3 లీటర్లు 1-2 లీటర్లు 4-5 లీటర్లు సరిపడా తాగితే చాలు శక్తికి నల్ల శనగలు శనగలు కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మంచి పోషకాలను కలిగి ఉండటం వల్ల ఎముకలు బలంగా ఉంటాయి. శనగలు చర్మ ఆరోగ్యానికే కాదు, జుట్టు ఆరోగ్యానికి కూడా దోహదం చేస్తుంది. శనగలు శరీరానికి తగినంత శక్తిని ఇవ్వటానికి సహాయపడతాయి.

# ఐరన్, కాల్షియం లోపంతో బాధపడుతున్నారా.. అయితే ఈ సూపర్ ఫుడ్ ట్రై చేయండి!

మన సంప్రదాయ ఆహారంలో రాగులకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, రాగులను రోజూవారీ ఆహారంలో విరివిగా ఉపయోగిస్తారు. వీటిని పేద ప్రజల ఆహారంగా భావించినప్పటికీ, పోషకాల విషయంలో ఇవి ఏ మాత్రం తక్కువ కాదు. నిజానికి, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న రాగులు, నేడు ఆరోగ్య స్పృహ కలిగిన వారి ఆహారంలో ఒక భాగంగా మారుతున్నాయి. రాగులు పోషకాల గని. వీటిలో కాల్షియం, ఐరన్ మాత్రమే కాదు, ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు , ఇతర ఖనిజాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. 100 గ్రాముల రాగులలో 344 మి.గ్రా కాల్షియం ఉంటుంది. ఐరన్ 3.9 మి.గ్రా, ఫైబర్ 11 గ్రాములు , ప్రోటీన్ 7.3 గ్రాములు, కార్బోహైడ్రేట్లు 72 గ్రాములు, పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, జింక్ వంటివి అధికంగా ఉంటాయి. దీనిలో బి విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు కూడా లభిస్తాయి. ఆరోగ్య నిపుణులు హెచ్చరిక!" కాల్షియం పెంచడంలో సహాయం: రాగులు శరీరంలో కాల్షియం , ఐరన్ స్థాయిలను పెంచడానికి నిజంగానే సహాయపడతాయి. వీటిల్లో కాల్షియం చాలా ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఇతర ధాన్యాలతో పోలిస్తే, రాగులలో 5 నుండి 10 రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది. పాలు, పాల ఉత్పత్తులు తినని వారికి రాగులు ఒక గొప్ప ప్రత్యామ్నాయం. కాల్షియం ఎముకలు , దంతాల ఆరోగ్యానికి చాలా అవసరం. పిల్లలు, వృద్ధులలో ఎముకలు బలహీనపడకుండా రాగులు సహాయపడతాయి. ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల వ్యాధులను నివారించడంలో కూడా ఉపయోగపడతాయి. కాల్షియం కండరాల సంకోచానికి కూడా అవసరం. రాగులు కండరాలు సక్రమంగా పనిచేయడానికి సహాయపడతాయి. ఐరన్ పెంపు రాగులలో ఐరన్ కూడా గణనీయమైన మొత్తంలో ఉంటుంది. ఇది రక్తహీనత (అనీమియా) సమస్యను నివారించడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా మహిళలు , పిల్లలలో ఐరన్ లోపం సర్వసాధారణం. రాగులను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఐరన్ స్థాయిలను పెంచుకోవచ్చు. ఐరన్ శరీరంలోని కణాలకు ఆక్సిజన్ను చేరవేయడానికి అవసరం. తగినంత ఐరన్ లేకపోతే, అలసట, నీరసం వంటి సమస్యలు వస్తాయి. రాగులు ఐరన్ స్థాయిలను పెంచి, శక్తిని అందిస్తాయి. ఐరన్ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతుంది. రాగులు శరీరానికి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

# అందంతో పాటు ఆరోగ్యం కావాలంటే ఈ జ్యూస్ తాగండి!



సహజంగా ఆకుకూరల్లో లభించే పోషకాలు, మిటమిన్లు ఇతర ఏ కూరగాయల్లోనూ అంతగా లభించవు. ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి మంచిది అని డాక్టర్లు చెబుతుంటారు..మరి అవే ఆకు కూరలను జ్యూస్ చేసుకొని తాగితే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఆకుకూరలలో పాలకూరకు ఒక ముఖ్యమైన స్థానం ఉంది. పాలకూర పుష్కలంగా పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. పాలకూర జ్యూస్ తో ఈ సమస్యలకు చెక్ పాలకూరను జ్యూస్ చేసుకొని తాగడం వలన మనకు పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లు కావలసినన్ని లభిస్తాయి.. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడతాయి ,చర్మం పొడిబారకుండా ,ముడతలు రాకుండా కాపాడతాయి. పాలకూరలో మిటమిన్ ఏ కంటి చూపు సమస్య ఉన్నవారికి, రే చీకటితో బాధపడేవారికి ఉపయోగపడుతుంది . కాబట్టి పాలకూర జ్యూస్ తాగడం వలన ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చు. పాలకూర జ్యూస్ తో హైబీపీ నియంత్రణ పుట్టిన పసి పిల్లలకు పాలిచ్చే తల్లులకు పాల ఉత్పత్తి పెరగడం కోసం పాలకూర జ్యూస్ తాగితే ప్రయోజనం ఉంటుంది. పాలకూర జ్యూస్ వలన పాల ఉత్పత్తి పెరుగుతుంది.. పాలకూర జ్యూస్ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందడమే కాకుండా రక్తపోటు సమస్యతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుంది. పాలకూరలో పొటాషియం, మెగ్నీషియం , ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి . ఇది హైపర్ టెన్షన్ ను తగ్గిస్తుంది గుండె ఆరోగ్యానికి పాలకూర జ్యూస్ మెదడు పనితీరుని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని అరికడుతుంది. కాలేయ వ్యాధులను దూరం చేస్తుంది. మలబద్దక సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది.పాలకూర జ్యూస్ ను డైలీ కాకపోయిన్ వారంలో ఒకటి రెండు సార్లు తాగితే క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ముందుగానే జాగ్రత్త పడొచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు. పాలకూర జ్యూస్ తాగటం గుండె సంబంధిత వ్యాధుల నుండి విముక్తి కలిగిస్తుంది. బార్లీ నీళ్ళతో బీపీ, షుగర్ కంట్రోల్.. ఇంకా బోలెడు బెనిఫిట్స్.. వదిలిపెట్టొద్దు! పాలకూర జ్యూస్ తో అందం, ఆరోగ్యం పాలకూర జ్యూస్ తో చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జుట్టుకు బలం చేకూరుతుంది. జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.త్వరగా వృద్ధాప్య ఛాయలు రాకుండా ఉంటాయి. పాలకూర జ్యూస్ మన చర్మం ముడతలు రాకుండా చేస్తుంది.అందం, ఆరోగ్యం రెండింటినీ ఇచ్చే పాలకూరను జ్యూస్ రూపంలోనూ, స్మూతీ రూపంలోనూ చేసుకుని తీసుకుంటే మంచిది.

# ఎండాకాలం.. చల్లచల్లగా ఐస్ వేసిన జ్యూస్ లు తాగుతున్నారా? జాగ్రత్త!



ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఎండాకాలంలో చల్లచల్లని కూల్ కూల్ గా ఉండే జ్యూసులు తాగడాన్ని చాలామంది ఇష్టపడుతుంటారు. ఇంట్లో జ్యూసులు తయారు చేసుకోలేని వారు, బయట జ్యూస్ పాయింట్ల మీద ఆధారపడుతుంటారు. అయితే జ్యూస్ పాయింట్స్ వద్ద తయారు చేసే జ్యూసులు ఏమాత్రం మంచిది కాదని, వాటిలో వినియోగించే ఐస్ తో కూడా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రా ఐస్ వేసిన జ్యూస్ లతో అనారోగ్యాలు సాధారణంగా మంచినీళ్లతో ఇంట్లో తయారు చేసుకునే ఐస్ క్యూబ్స్ బాగానే ఉంటాయి. కానీ బయట జ్యూస్ పాయింట్ల వద్ద దొరికే రా ఐస్ మాత్రం అనేక ఆరోగ్య ప్రమాదాలకు కారణమని చెప్పొచ్చు. దీనిని శుభ్రమైన నీళ్లతో తయారు చేయకపోవడం వల్ల, వీటిలో కలుషితాలు, మలినాలు ఉండే అవకాశం ఉంటుంది. రా ఐస్ లో హానికరమైన బ్యాక్టీరియా ఉండడంవల్ల ఇది అనేక రోగాలకు కారణమవుతుంది. . ఆరోగ్య నిపుణులు హెచ్చరిక!" ఐస్ వేసిన జ్యూస్ లతో ఈ అనారోగ్య సమస్యలు రా ఐస్ లో నోరో వైరస్, ఈకోలీ వంటి బ్యాక్టీరియా ఉంటాయి. ఇవి వ్యాధి కారకాలుగా చెప్పవచ్చు. అయితే ఈ రా ఐస్ తో తయారు చేసిన జ్యూసులు తాగినప్పుడు జీర్ణ సంబంధితమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. వీటితో గొంతు నొప్పి, దగ్గు, జలుబు వంటి సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. వాంతులు , విరోచనాలు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కూడా రావచ్చు. బయట జ్యూస్ పాయింట్ల వద్ద జ్యూస్ తాగొద్దు ఆస్తమా, బ్రాంకైటిస్, సైనస్ వంటి సమస్యలు ఉన్నవారు ఈ రా ఐస్ తో తయారు చేసినటువంటి జ్యూసులు తాగకుండా ఉంటేనే మంచిది. విపరీతమైన ఎండల్లో తీవ్రమైన దాహంతో ఉన్నవాళ్లు జ్యూస్ పాయింట్స్ వద్దకు వెళ్లి చల్ల చల్లగా వేసిన ఐస్ తో ఉన్న జ్యూస్లను ఒకటికి రెండు గ్లాసులు తాగుతూ ఉంటారు. ఇది తీవ్ర ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందని, సాధ్యమైనంత వరకు బయట జ్యూస్ లు తాగకుండా ఉంటేనే మంచిదని చెబుతున్నారు. ఒక జ్యూస్ లు మాత్రమే కాదు బయట రా ఐస్ తో తయారు చేసిన ఏ పానీయాలను తాగకుండా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు.

## ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా? ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా?

ఖర్జూరం.. తీయటి రుచికి, మెత్తటి స్పర్శకు మారుపేరు. ఎడారి ప్రాంతపు బంగారంగా పిలువబడే ఈ ఫలం ఎన్నో పోషక విలువలతో నిండి ఉంటుంది. తక్షణ శక్తిని అందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తహీనతను తగ్గించడంలో ఖర్జూరం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే చాలామంది ఖర్జూరాన్ని తమ ఆహారంలో భాగంగా చేసుకుంటారు. అయితే, కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా పరిమితంగా తీసుకోవడం మంచిది. లేదంటే కొన్ని ప్రతికూల ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎవరు ఆ ఖర్జూరం తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయిల పెంపు: ఖర్జూరంలో సహజ చక్కెరలు (ఫ్రక్టోజ్, గ్లూకోజ్) అధికంగా ఉంటాయి. మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఇది వారి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. ఒకవేళ తినాలనిపిస్తే, వైద్యుల సలహా మేరకు చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. వారి డైట్లో భాగంగా ఇతర ఆహారాలను బ్యాలెన్స్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆరోగ్య నిపుణులు హెచ్చరిక!" ఊబకాయంతో బాధపడుతున్నవారు: ఖర్జూరంలో కేలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఒక సాధారణ సైజు ఖర్జూరంలో సుమారు 20-25 కేలరీలు ఉంటాయి. అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నవారు ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల వారి బరువు మరింత పెరిగే అవకాశం ఉంది. బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా చాలా తక్కువ మొత్తంలో తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ తీసుకోవాలనుకుంటే, వారి రోజువారీ కేలరీల లెక్కల్లో దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మూత్రపిండాల సమస్యలు పెంపు. ఖర్జూరంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యక్తులకు ఇది మంచిదే అయినప్పటికీ, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు లేదా హైపర్కలేమియాతో బాధపడుతున్నవారు ఎక్కువ పొటాషియం తీసుకోవడం ప్రమాదకరం. వారి శరీరంలోని మూత్రపిండాలు అదనపు పొటాషియంను సమర్థవంతంగా తొలగించలేవు. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఇలాంటి సమస్యలు ఉన్నవారు ఖర్జూరం తినే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

# అప్పట్లో నాకు ఆర్సీబీలో చేరాలనే ఆసక్తే లేదు: రజత్ పాటీదార్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ 2025లో తొలిసారి ట్రోఫీని ముద్దాడింది. డిఫెండింగ్ కాదు అటాకింగ్ ఛాంపియన్స్ అంటూ ఈ ఏడాది బరిలోకి దిగిన ఆర్సీబీ.. అదే దూకుడును కొనసాగించి వరుసగా రెండోసారి కప్పును సొంతం చేసుకుంది. రీప్లేస్‌మెంట్‌గా జట్టులోకి వచ్చిన రజత్ పాటీదార్.. అద్భుత ప్రదర్శనలతో ఆర్సీబీకి కెప్టెన్ అయ్యాడు. జట్టు పగ్గాలు అందుకున్న తొలి సీజన్‌లోనే జట్టుకు ఐపీఎల్ ట్రోఫీని అందించాడు. వరుసగా రెండుసార్లు ఆర్సీబీని ఛాంపియన్‌గా నిలిపిన కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. అయితే రజత్ పాటీదార్ ఆర్సీబీతో తన ప్రయాణం గురించి తాజాగా ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు.'నిజం చెప్పాలంటే.. మొదట్లో ఆర్సీబీలో చేరాలని నేను అనుకోలేదు. రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా పిలిచారు కాబట్టి ఆడే అవకాశం రావడం కష్టమేనని భావించాను. జట్టులో చేరిన తర్వాత కూడా నాకు అదే విషయం చెప్పారు. 'నువ్వు రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌వి. ఎవరైనా గాయపడితే తప్ప నీకు అవకాశం రావడం కష్టం. అప్పటి వరకు రిలాక్స్ అవ్వు' అని స్పష్టం చేశారు. అందుకే ఆర్సీబీ జట్టులో చేరడానికి నాకు అస్సలు ఇష్టం లేదు. అప్పుడే నా పెళ్లి డేట్ కూడా ఫిక్స్ అయింది. బెంచ్‌పైనే ఉండాలని తెలిసినప్పుడు ఎందుకు వెళ్లడం అనిపించింది. కట్ చేస్తే.. రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గానే ఆడాను. నా సత్తా ఏంటో నిరూపించుకున్నాను' అని పాటీదార్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు.ఐపీఎల్ 2021 మినీ వేలంలో రూ.20 లక్షలకు ఆర్సీబీ రజత్‌ను కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం 71 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2022 వేలంలో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదు. దీంతో ఆర్సీబీ రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా పాటీదార్‌ను ఎంపిక చేసింది. ఆ సీజన్‌లో అనూహ్యంగా ఆర్సీబీ ప్లేయర్ సిసోడియా గాయపడటంతో అతడిని జట్టులోకి తీసుకున్నారు. అయితే వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్న పాటీదార్.. అదే సీజన్‌లో ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీపై అజేయ శతకం (112×) బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. 2025 ఐపీఎల్ మెగా వేలం అనంతరం ఆర్సీబీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన పాటీదార్.. ఫ్రాంచైజీ చరిత్రలో తొలి ఐపీఎల్ టైటిల్ అందించిన సారథిగా నిలిచాడు. ఆ తర్వాత 2026లోనూ జట్టును విజేతగా నిలిపి ఆర్సీబీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు.




# వైభవ్ ఏం చేస్తాడో.. నాకైతే డౌటే: ఏబీ డివిలియర్స్




టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే టీ20ల్లో తన రేంజ్ ఏంటో ప్రపంచానికి చాటిచెప్పాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో ఏకంగా 776 పరుగులతో తాను చిచ్చర పిడుగు అని అనిపించుకున్నాడు. 15 ఏళ్ల చిరు ప్రాయంలోనే టీమిండియా టీ20 జట్టుకు కూడా ఎంపికై అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నాడు. వన్డేలు, టెస్టులపై కూడా తనకు ఆసక్తి ఉందని వైభవ్ ఒక సందర్భంలో చెప్పాడు. ఈ విషయమై దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'అతడికి అద్భుతమైన టాలెంట్ ఉంది. కానీ రెడ్ బాల్ క్రికెట్ విషయంలో అతడు ఏం చేస్తాడో నేనైతే ఇప్పుడే చెప్పలేను. కావాలనుకుంటే అతడు ఏదైనా చేయగలడు. కానీ టెస్టులపై అతడి ఆసక్తి ఏమేరకు ఉందో తెలియదు. నాకైతే ఈ విషయంలో కొన్ని సందేహాలు ఉన్నాయి. ఇందులో కాలుపెట్టాలనుకుంటే మాత్రం కొన్ని సవాళ్లు తప్పవు. అతడు టెస్టులపై కూడా దృష్టిపెట్టాలనే కోరుకుంటున్నా. చూద్దాం ఏం జరుగుతుందో..' అని డివిలియర్స్ అన్నారు.దక్షిణాఫ్రికా అత్యుత్తమ ప్లేయర్లలో ఒకరైన డివిలియర్స్ తను ఆడే రోజుల్లో ఎన్నో కొత్త షాట్స్‌ను కూడా ప్రవేశపెట్టారు. ప్రస్తుతం క్రికెట్‌లో కూడా ఏఐ సాంకేతికత ప్రవేశించడంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఆడే రోజుల్లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చి ఉంటే తనకు మరింత ప్రయోజనం కలిగి ఉండేదని చెప్పారు. ఒక్కో షాట్‌లో రిస్క్ ఎంత ఉంటుందో ఏఐ ద్వారా విశ్లేషించే అవకాశం ఉండేదని చెప్పారు.

# 152 పరుగులకు ఆలౌట్ అయిన ఆఫ్గనిస్తాన్ ..6 వికెట్లతో సత్తా చాటిన మానవ్ సుతార్

హైదరాబాద్ : న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో(ంటణప్త్రజీనితిబబిజీని) జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో(ంవబబి ఎజీబిఇష్ట్ర) తొలి ఇన్నింగ్స్‌లో 58.4 ఓవర్లలో ఆఫ్గనిస్తాన్ 152 పరుగులకు ఆలౌట్ అయింది. ఆరంగేట్రం మ్యాచ్‌లోనే మానవ్ సుతార్ 6 వికెట్లు తీసి సత్తా చాటాడు. దీంతో ఆఫ్గాన్ 152 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో రహ్మత్ షా(60) ఒక్కడే రాణించాడు. ప్రసిద్ధ్ క్రిష్ణ 3వికెట్లు తీసుకోగా వాషింగ్టన్ సుందన్ ఒక వికెట్ తీశాడు. స్వల్ప స్కోరుకే పరిమితమైన ఆఫ్గాన్‌ను ఇండియా ఫాల్‌ఆన్‌కు ఆహ్వానించింది. 412 పరుగుల లోటుతో సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించిన ఆ జట్టు 4 ఓవర్లలో వికెట్లేమీ కోల్పోకుండా 18 పరుగులు చేసింది.కాగా, న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో(ంవబబి ఎజీబిఇష్ట్ర) శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ సాధించిన శతకాలతో టీమిండియా భారీ స్కోర్ చేసింది. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ (177 బంతుల్లో 126, 15ఫోర్లు, 1సిక్స్), కేఎల్ రాహుల్(100), సెంచరీలు సాధించగామూడో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చిన సాయి సుదర్శన్ (81), రిషబ్ పంత్ (81), వాషింగ్టన్ సుందర్(52) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు.ఆఫ్గానిస్థాన్ బౌలర్లలో సలీమ్ సాఫి 6 వికెట్లతో చెలరేగాడు. రెహమాన్ షరీఫీ, హష్మతుల్లా షాహిదీ తలొక వికెట్ పడగొట్టారు. కాగా, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై లభించిన అవకాశాన్ని యశస్వి జైస్వాల్సద్వినియోగం చేసుకోలేకపోయాడు.సఫీ బౌలింగ్‌లో (24) పరుగులకే వెనుదిరిగాడు.



# అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు: టీమిండియా ఘన విజయం




ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు 300 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఫాలోఆన్‌లో అఫ్గానిస్థాన్ జట్టు 112 పరుగులకే కుప్పకూలింది. అయితే టెస్టుల్లో టీమిండియాకు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. ఫాలోఆన్‌లో సెదిఖుల్లా అటల్(42) టాప్ స్కోరర్. రహ్మనుల్లా గుర్బాజ్(24) పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. ఫాలోఆన్‌లో భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 4, కుల్‌దీప్ యాదవ్ 3, మానవ్ సుతార్ 1 వికెట్ పడగొట్టారు.టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన టీమిండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 564/8 వద్ద డిక్లేర్ ప్రకటించింది. కేఎల్ రాహుల్(100), శుభ్‌మన్ గిల్(126) సెంచరీలతో అదరగొట్టారు. సాయి సుదర్శన్(81), రిషభ్ పంత్(81), వాషింగ్టన్ సుందర్(52×) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. రెండో ఇన్నింగ్స్‌లో అఫ్గానిస్థాన్ 152 పరుగులకే ఆలౌటైంది. అరంగేట్రంలోనే యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 6 వికెట్లతో సత్తా చాటాడు. రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌కు 412 పరుగుల భారీ ఆధిక్యం లభించడంతో.. అఫ్గాన్‌తో ఫాలోఆన్ ఆడించింది. ఫాలోఆన్‌లో కూడా అఫ్గాన్ బ్యాటర్లు పేలవ ప్రదర్శన కనబర్చారు. భారత బౌలర్ల ధాటికి విలవిల్లాడారు. 112 పరుగులకే ఫాలోఆన్‌లో కుప్పకూలారు. దీంతో భారత్ టెస్టు చరిత్రలోనే అతిపెద్ద విజయం సాధించింది.

# వైభవ్‌పై అంచనాలు పెంచుకోవద్దు: సౌరభ్ గంగూలీ




ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు రానున్న ఆసియా గేమ్స్ 2026కు సంబంధించిన భారత టీ20 జట్టులో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని బీసీసీఐ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. 15 ఏళ్ల వయసులోనే భారత క్రికెట్ జట్టుకు ఎంపికైన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనలతో అదరగొట్టిన అతడు.. 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే భారత జట్టులోకి ఎంట్రీ ఇస్తున్న ఈ కుర్రాడిపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా దిగ్గజ క్రికెటర్ సౌరభ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌పై అతిగా అంచనాలు పెట్టుకోవద్దని అభిమానులకు సూచించాడు'వైభవ్‌ను తన దారిలోనే వెళ్లనివ్వాలి. అతడి నుంచి ఇప్పుడే అద్భుతాలు ఆశించకండి. భారత జట్టులో స్థిరపడేందుకు వైభవ్‌కు కాస్త సమయం ఇవ్వాలి. అతడిలో అపార ప్రతిభ ఉంది. వైభవ్‌కు ఇప్పుడు కేవలం 15 ఏళ్లే. ఒత్తిడి అంటే ఏంటో కూడా సరిగ్గా అర్థం చేసుకోలేని వయసు. ఐపీఎల్‌లో కూడా ఒత్తిడిని ఏమాత్రం పట్టించుకోకుండా ఆడిన తీరు నన్ను ఆకట్టుకుంది. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. భారత్ తరఫున స్వదేశంలో ఆడటం వేరు. విదేశాల్లో వికెట్లు భిన్నంగా ఉంటాయి. బంతికి ఎక్కువ సీమ్, బౌన్స్ ఉంటుంది. కాబట్టి ఆట కూడా మారుతుంది. అయినప్పటికీ వాటన్నింటినీ ఎదుర్కొనే సత్తా వైభవ్‌కు ఉంది' అని గంగూలీ వెల్లడించాడు.ఇటీవల ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల కోసం ప్రకటించిన భారత టీ20 జట్టులో వైభవ్‌కు అవకాశం లభించింది. అలాగే 2026 ఆసియా క్రీడల కోసం ఎంపికైన భారత జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. ఐర్లాండ్‌తో ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌లో వైభవ్‌కు అంతర్జాతీయ అరంగేట్రం చేసే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఓపెనర్ స్థానం కోసం అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లతో వైభవ్ పోటీ పడనున్నాడు.

# మొనాకో గ్రాన్‌ప్రీ.. రియాల్టీ టీవీ స్టార్‌ను ముద్దాడిన హామిల్టన్

పార్ములా వన్ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్ ఈసారి మొనాకో గ్రాన్‌ప్రీలో రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, రేసు ముగిసిన తరువాత అతడు రియాల్టీ టీవీ స్టార్ కిమ్ కర్దాషియన్‌ను ముద్దాడటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. తాము రిలేషన్‌లో ఉన్నట్టు అటు కిమ్ గానీ ఇటు హామిల్టన్ గానీ ఎప్పుడూ బయటపడలేదు. విలేకరుల ప్రశ్నలకు కేవలం చిరునవ్వులతో సమాధానం ఇస్తుంటారు. ఇప్పటికే వారు పలు ఈవెంట్స్‌కు కలిసి హాజరయ్యారు. ఈసారి రేసుకు వచ్చిన కిమ్ స్టాండ్స్‌లో నిలబడి హామిల్టన్‌ను ప్రోత్సహించిందిఇక రేసు ముగిసిన అనంతరం హామిల్టన్‌ను చుట్టుముట్టిన విలేకరులు కిమ్‌తో ఆయన రిలేషన్‌షిప్ గురించి పలు ప్రశ్నలు సంధించారు. అంతటి హైప్రొఫైల్ సెలబ్రిటీ మీకు మద్దతుగా ఉండటంపై స్పందన ఏమిటని ప్రశ్నించారు. 'ఆమె రావడం నిజంగా అద్భుతమే. ఇంత మంది మంచి ఫ్రెండ్స్ నా కోసం రావడం నిజంగా అద్భుతంగా అనిపిస్తోంది. ఇంతకు మించి ఏం చెప్పాలో కూడా నాకు తెలియట్లేదు. మంచి వ్యక్తులు నిత్యం చుట్టూ ఉండి ప్రోత్సహిస్తూ ఉంటే గొప్పగా ఉంటుంది. ఆమె ఎప్పుడూ ఇంతే' అని చెప్పాడు. నెం.2గా నిలిచాక ట్రోఫీ తీసుకున్న అనంతరం కిమ్‌కు హామిల్టన్ ఒక ఫ్లయ్యింగ్ కిస్ కూడా ఇచ్చాడు. అక్కడి నుంచి వెళ్లిపోతున్న తరుణంలో మాత్రం సంశయాలన్నీ పక్కన పెట్టేసి కిమ్ బుగ్గపై కిస్ ఇచ్చాడు. దీంతో, వారు రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టే అని అభిమానులు కామెంట్ చేస్తున్నారు.హామిల్టన్ ఇప్పటికే ఏడు సార్లు ఎఫ్-1 ఛాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నాడు. ఇక ఫెర్రారీతో తన కాంట్రాక్ట్ 2027 వరకూ కొనసాగుతుందని కూడా చెప్పాడు. కొందరు తనను రిటైర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు మాత్రం అసలు ఆ ఆలోచనే లేదని చెప్పాడు.



# సినిమా

## నిజాయితీగా పని చేస్తే సినిమా తప్పకుండా హిట్ అవుతుందని 'పెద్ది' నిరూపించింది.

### ఇంత గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు: 'పెద్ది' థ్యాంక్ యూ మీట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'థాంక్ యూ' ప్రెస్ మీట్‌ను నిర్వహించింది.

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... ప్రేక్షకులు, అభిమానులు, మీడియా మిత్రులు అందరికీ మనస్ఫూర్తిగా థ్యాంక్యూ చెప్పడానికి ఇక్కడికి వచ్చాను. ఇష్టపడి, ప్రేమిస్తూ ఒక పని చేస్తూ ఇంకా చెప్పాలంటే నాకు తెలిసిన పని చేస్తూ ఇంత ప్రేమను పొందడం సర్‌ప్రైజింగ్‌గా వుంది. ఇది ఎవరో పుష్ చేస్తే చేసిన సినిమా కాదు. బుచ్చిబాబు చెప్పిన కథను నమ్మి ఈ సినిమా చేసినందుకు నాకు ఎంతో సంతృప్తిగా ఉంది. దేశవ్యాప్తంగా, విదేశాల్లో కూడా ప్రతి రోజు సినిమా కలెక్షన్లు పెరుగుతుండటం, ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ పెరుగుతుండటం చూస్తున్నాను. ప్రేక్షకులందరికీ శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చాలా రోజుల తర్వాత ఫస్ట్ ప్రసాద్ ఐమాక్స్‌లో సినిమా చూశాను. అక్కడ మాస్ థియేటర్‌కు వచ్చేంత రియాక్షన్ కనిపించింది. నేను ఊహించని సన్నివేశాలకు కూడా చప్పట్లు కొట్టారు. సినిమా చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉందని చెబుతున్నారు. అలాంటి అనుభూతిని నాకు కలిగించిన మా టీమ్ అందరికీ ధన్యవాదాలు. నా సినీ లైబ్రరీలో నెంబరు 1, 2 గా నిలిచే సినిమా ఇది. మొదటిసారి కథ విన్నప్పుడు బుచ్చిబాబును హగ్ చేసుకున్నాను. కానీ ఇది ఎంత రిస్క్ అయిన కథ అనేది తర్వాత తెలిసింది. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే, వాళ్లు ఈ సినిమాను స్వీకరించిన తీరు చూస్తుంటే, ఎవరైనా మనస్ఫూర్తిగా, నిజాయితీగా పని చేస్తే అది రేజర్ ఎడ్జ్ సినిమా అయినా, కమర్షియల్ సేఫ్ జోన్ సినిమా అయిన తప్పకుండా హిట్ కావాల్సిందే. అలాంటి విజయాన్ని మాకు అందించిన భారతదేశంలోని, విదేశాల్లోని ప్రతి ప్రేక్షకుడికి ధన్యవాదాలు. కుర్రాళ్లు, చిన్నపిల్లలు, వాళ్ల తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు. అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. జగపతిబాబు గారు చెప్పినట్టే, ఒక సినిమాను కోట్లాది మందికి చేరవేసేది మీడియానే. ఈ సందర్భంగా మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు చెబుతున్నాను. జగపతిబాబు గారిని ఈ సినిమాలో చూస్తున్నప్పుడు నా కళ్లలో నీళ్లు వచ్చాయి. అంత అద్భుతంగా, అంత ఇన్‌స్పైరింగ్‌గా ఆయన పాత్రను పోషించారు. అలాగే శివరాజ్‌కుమార్ గారు, మిగతా నటీనటులందరికీ ధన్యవాదాలు. మేమంతా చాలా కష్టపడి, ఇష్టపడి ఈ సినిమా చేశాం. రెహమాన్ గారు తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో మా పెర్ఫార్మెన్స్‌లను మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. సతీష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఇంత భారీ బడ్జెట్, ఇంత పెద్ద సబ్జెక్ట్ అయినా ఒక్కరోజు కూడా ఎలాంటి ఒత్తిడి తెలియనివ్వకుండా ఎంతో హ్యాపీగా సినిమా నిర్మించారు. 185 రోజుల షూటింగ్‌లో, దాదపు 165 రోజుల పాటు మా వెంటనే ఉన్నారు. ఆయనకు థ్యాంక్యూ సో మచ్. అనంత శ్రీరామ్ గారు రాసిన పాటలు జీవితాంతం నా ప్లేలిస్ట్‌లో ఉంటాయి. అంత ఇన్‌స్పైరింగ్ లిరిక్స్ రాశారు. ఆయనకు కూడా ధన్యవాదాలు. అలాగే బాలాజీ గారికి కూడా థ్యాంక్యూ సో మచ్. పెద్ది లాంటి సినిమాకు నిజాయితీ అవసరం. ప్రేక్షకులు కూడా నిజాయితీగా థియేటర్‌కు రావాలంటే, మేము నిజాయితీగా పని చేయాలి. మా సినిమా కోసం అంత నిజాయితీగా పనిచేసిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

జగపతిబాబు మాట్లాడుతూ... పెద్ది ఆడాడు... పోరాడాడు... గెలిచాడు. రిలీజ్ అయిన తర్వాత కూడా మళ్లీ పోరాడాల్సి వచ్చింది. మళ్లీ గెలిచాడు. 300 కోట్లు, 400 కోట్లు అనేది పక్కన పెడితే, ఈ సినిమా ఎంత పెద్ద విజయం అనేది 300 రూపాయల టికెట్ కొన్న ప్రేక్షకుడే దాన్ని నిర్ణయిస్తాడు. ప్రేక్షకుల చేతిలో అంత పవర్ ఉంది. మనది అలాంటి వల్నరబుల్ ఇండస్ట్రీ. అలాంటి ఇండస్ట్రీలో బుచ్చిబాబు ఒక మెగా పవర్ స్టార్‌కి ఈ కథ చెప్పడం, ఈ పాత్రను కన్విన్స్ చేయడం, చరణ్ దాన్ని నమ్మడం, దాన్ని తీయడానికి నిర్మాత ముందుకు రావడం మామూలు విషయం కాదు. కొంచెం అటు ఇటు అయినా ప్రేక్షకులు తిరస్కరించే అవకాశం ఉంది. అంత రేజర్ ఎడ్జ్ మీద నడిచిన సినిమా ఇది. చరణ్ ఈ సినిమాను నెత్తిన పెట్టుకుని మోశాడు. అందరినీ మెస్మరైజ్ చేశాడు. తను జస్ట్ మాన్ కాదు... సూపర్‌మ్యాన్, హీ-మ్యాన్. 'పెద్ది' సినిమా ఒక కల్ట్ మారిపోయింది. ఈ సినిమాకు ఆ రోజు, ఈ రోజు అనే తేడా లేదు. ఏ రోజైనా 'పెద్ది' రోజే. సినిమాకు దమ్ము ఉంది కాబట్టే ఇంత దూరం వచ్చింది. రిలీజ్ ఈవెంట్‌లోనే 'పెద్ది కొట్టేది ప్రతిదీ సిక్సరే' అని చెప్పాను. అలాగే నా కెరీర్‌లో ఇదే బెస్ట్ క్యారెక్టర్ అవుతుందని కూడా చెప్పాను. అప్పుడు ఎక్కువ మాట్లాడానా అని భయపడ్డాను. కానీ ఇప్పుడు చూస్తుంటే నేను తక్కువే మాట్లాడాననిపిస్తోంది. సినిమా కలెక్షన్లు, స్పందన అన్నీ అదే చెబుతున్నాయి. ఈ సందర్భంగా చిరంజీవి గారికి థ్యాంక్స్ చెప్పాలి. ఆయన ట్వీట్ చేస్తూ 'నా బ్రదర్ జగపతిబాబు' అన్నారు. అది నాకు ఆయన నుంచి వచ్చిన అతిపెద్ద కాంప్లిమెంట్. ఈ సినిమా వచ్చాక అందరూ ఊపిరి పీల్చుకుంటారని ముందే చెప్పాను. నిజంగానే ఇప్పుడు అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ సినిమా విజయం పట్ల చాలా ఆనందంగా ఉన్నాను. దీనిని మరింత పెద్ద విజయంగా చేయాలని అందరినీ కోరుకుంటున్నాను. నాకు మరో అద్భుతమైన పాత్ర ఇచ్చిన బుచ్చిబాబుకి ధన్యవాదాలు. అలాగే నా ఫేవరెట్ హీరో చరణ్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాను ఆదరించిన ప్రతి ప్రేక్షకుడికి హృదయపూర్వక ధన్యవాదాలు.

డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ... ఈ సినిమాను ఇంత ఘన విజయం చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఒక మంచి కథను చెప్పాలనే ఉద్దేశంతో నేను, చరణ్ గారు మీ ముందుకు వచ్చాం. ఇది రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాదు. ఇది ఒక ఇన్‌స్పిరేషనల్ స్టోరీ, ఒక ఇన్‌స్పిరేషనల్ జర్నీ. ప్రధాని మోదీ గారు ప్రారంభించిన 'ఖేలో ఇండియా' కార్యక్రమం కూడా నాకు ఒక స్ఫూర్తిగా నిలిచింది. గ్రామాల్లో ఉన్న యువకులు తలచుకుంటే దేశానికి పతకాలు తీసుకురాగలరని అది నిరూపించింది. భారతీయ జీవన విధానంలో ఆట ఒక భాగం. ఒక వ్యవస్థలో మనిషికి గుర్తింపు ఎంత ముఖ్యమో చెప్పాలనుకున్నాం. తన ఊరి కోసం, తన గుర్తింపు కోసం ఒక వ్యక్తి ఎంత పోరాడతాడు అనేదే ఈ కథ. ఈ దేశంలో ఇప్పటికీ గుర్తింపు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దాదాపు 18 వేల గ్రామాలు అలాంటి పరిస్థితిలో ఉన్నాయని నేను చదివాను. అలాంటి గ్రామాలన్నింటినీ భాగం చేయాలనే ఒక ప్రయత్నం చేశాను. ఇలాంటి ప్రయత్నానికి రామ్ చరణ్ గారు ముందుండి మద్దతు ఇచ్చారు. ఆయన సపోర్ట్‌ను నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఈ కథను నేను ఎంతగా నమ్మానో, చరణ్ గారు కూడా అంతే నమ్మారు. దానికి ఫలితమే గత నాలుగు రోజులుగా వస్తున్న అభినందనలు, ప్రశంసలు. చాలా మంది 'మంచి సినిమా తీశారు', 'రామ్ చరణ్ గారి పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంది' అని మెసేజ్‌లు పెడుతున్నారు. అప్పలసూరి పాత్ర ఈ సినిమాకు చాలా ముఖ్యమైనది. జగపతిబాబు గారు అద్భుతమైన నటన కనబరిచారు. సినిమా చూస్తున్న ప్రేక్షకులు చివరి నాలుగు నిమిషాల్లో చాలా ఎమోషనల్ అవుతున్నారు. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. నేను ఏది ఫీల్ అయ్యానో అదే జరిగింది. హాస్పిటల్ సీన్ దగ్గర ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. చాలామంది నేషనల్ అవార్డు వస్తుందని అంటున్నారు. ఒక దర్శకుడిగా అంతకంటే పెద్ద ఆనందం ఉండదు. నాకు ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన సతీష్ గారికి జీవితాంతం రుణపడి ఉంటాను. సినిమా ఇంకా థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. హాలిడేస్‌లో అమ్మమ్మ ఇంటికి వెళ్లినట్లు, 'పెద్ది' ఆడుతున్న థియేటర్లకు కూడా వెళ్లి చూడండి. అందరికీ ధన్యవాదాలు."

మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ... రామ్ చరణ్ గారికి, సతీష్ గారికి, అందరికీ పేరుపేరునా నమస్కారం. ప్రసాద్ మల్టీప్లెక్స్‌లోపెద్ది రెండోసారి చూసినప్పుడు మొదటిసారి కలిగిన భావోద్వేగాలే మళ్లీ కలిగాయి. సినిమా అయిపోయాక చరణ్ గారు నడుచుకుంటూ వెళ్తుంటే, 'అరే, ఆయన కాలికి బాగోలేదు కాదా?' అనిపించింది. అంతగా పాత్రలో లీనమైపోయాం. ఆయన పెర్ఫార్మెన్స్ అంత ఇంపాక్ట్ ఇచ్చింది. చరణ్ గారు ఈ సినిమాను ఒంటికాలితో ముందుకు తీసుకెళ్లారు. జగపతిబాబు గారి పాత్ర దగ్గర నుంచే కథకు అసలు మలుపు మొదలవుతుంది. ఇది ఆయన కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్‌లలో ఒకటి. దర్శకుడు బుచ్చిబాబు అద్భుతమైన ఆలోచనతో వచ్చాడు. కొత్తదనం కోరుకునేవారికి, ఎమోషన్ ఇష్టపడేవారికి, కుటుంబంతో కలిసి సినిమా చూడాలనుకునేవారికి 'పెద్ది' అద్భుతమైన సినిమా. సోమవారం కూడా కలెక్షన్లు ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నాయి. అన్ని చోట్ల హౌస్‌ఫుల్స్ కనిపిస్తున్నాయి. ఇది ఒక సంక్రాంతి సినిమా లాగా దూసుకెళ్తోంది. తల్లిదండ్రులందరికీ ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. మీ పిల్లలకు తప్పకుండా ఈ సినిమా చూపించండి. గొప్ప స్ఫూర్తిని ఇచ్చే సినిమా ఇది. ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లిన రామ్ చరణ్ గారికి ధన్యవాదాలు. భవిష్యత్తులో ఇది ఒక రిఫరెన్స్ పాయింట్‌గా నిలిచిపోతుంది. టెక్నీషియన్స్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులందరికీ థ్యాంక్యూ. మీరు ఈ సినిమాను ఎంతగా ఆదరించారో మాటల్లో చెప్పలేను. ఫ్యామిలీస్, పిల్లలు మొదటి రోజు నుంచి నాలుగో రోజు వరకు అద్భుతంగా ఆదరిస్తున్నారు. సోమవారం కూడా కలెక్షన్లు ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నాయి. తెలుగు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. హిందీలో కూడా సినిమా మంచి స్పందన తెచ్చుకుంటోంది. రామ్ చరణ్ గారు ఈ సినిమాను ఒంటిచేత్తో ముందుకు తీసుకెళ్తున్నారు. ఆయన కష్టాన్ని తెలుగు ప్రేక్షకులు గుర్తించి ఆదరిస్తున్నారు. నా తొలి సినిమానే ఇంత పెద్ద విజయం సాధించడం చాలా గర్వంగా ఉంది. ఇది జీవితాంతం గుర్తుండిపోయే మెమొరబుల్ మూమెంట్. చరణ్ గారు తన నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారు. బుచ్చిబాబు కూడా ఎంతో కష్టపడ్డాడు. మైత్రి మూవీ మేకర్స్ సినిమాను అద్భుతంగా ముందుకు తీసుకెళ్లారు. డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అందరూ సంతోషంగా ఉన్నారు. థియేటర్లు మళ్లీ కళకళలాడుతున్నాయి. 'మళ్లీ సంక్రాంతి వచ్చిందా?' అని అందరూ మాట్లాడుకుంటున్నారు. తెలుగు ఇండస్ట్రీ ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను. మళ్లీ సక్సెస్ మీట్‌లో కలుద్దాం.

## విజయ్ ఆంటోని 'వంద దేవుళ్ళు' ట్రైలర్‌ను రిలీజ్ చేసిన మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల



విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి నిర్మించిన చిత్రం 'వంద దేవుళ్ళు'. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయబోతోన్నారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, పోస్టర్లు ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు.

'ఈ లోకంలో ప్రాణాలతో పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి.. తినడం, నిద్రపోవడం, తోడు వెతుక్కోవడం' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తరువాత వచ్చిన హీరో, హీరోయిన్ల ప్రేమ సన్నివేశాలు ఎంతో రిఫ్రెషింగ్‌గా అనిపించాయి. ఇక ఈ కథలో భార్యాభర్తల బంధం, తల్లీకొడుకుల అనుబంధాన్ని గొప్పగా చూపించినట్టు కనిపిస్తోంది. అన్ని రకాల ఎలిమెంట్స్‌ను జోడించిన ఈ కథను అద్భుతంగా మలిచినట్టు అనిపిస్తోంది. యాక్షన్స్, విజువల్స్, బీజీఎం ఇలా అన్నీ కూడా ట్రైలర్‌లో హైలెట్ అవుతున్నాయి.

×నిహారిక కొణిదెల గారు ట్రైలర్ పై,× "వంద దేవుళ్ళు' ట్రైలర్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. స్వాసిక గారు అద్భుతంగా కనిపిస్తున్నారు. పాత్రకు న్యాయం చేసినట్టుగా అనిపిస్తోంది. ఇలాంటి ఓ హృద్యమైన కథతో వస్తోన్న శశి గారికి ఆల్ ది బెస్ట్. విజయ్ ఆంటోనీ గారిని చూస్తుంటే ఈ సారి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టేలా కనిపిస్తున్నారు. ఎమోషన్స్, రిలేషన్ షిప్స్‌ను కలిపి గొప్ప కథను అందించబోతోన్నారని స్పష్టంగా అర్థం అవుతోంది. టీం మొత్తానికి ఆల్ ది బెస్ట్' అని పోస్ట్ చేశారు.

ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఇక ఈ మూవీని జూన్ 19న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

×నటీనటులు× : విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు

## 'జంగా' మూవీ నుంచి మోషన్ పోస్టర్ విడుదల



శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ మీద రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న చిత్రం 'జంగా'. త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్ , గగన్ విహారి, చందు గౌడ,సమీర్,

నాగ మహేష్,భూపాల్,

రఘు కారుమంచి, రచ్చ రవి,

ప్రధాన పాత్రల్లో రాబోతోన్న ఈ మూవీకి కెవిన్ గడ్డం(శ్రీహరి) కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు.

త్రిగుణ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రయూనిట్ స్పెషల్ అప్డేట్‌ను ఇచ్చారు.

త్రిగుణ్ బర్త్ డే స్పెషల్‌గా 'జంగా' నుంచి పోస్టర్ ఒ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులోని విజువల్స్, సౌండింగ్, హీరో లుక్ చాలా కొత్తగా ఉన్నాయి. ఇంత వరకు లవర్ బాయ్‌లా కనిపించిన త్రిగుణ్ ఈ సారి రా అండ్ రస్టిక్ లుక్‌లో మాసీగా కనిపిస్తున్నారు. కెరీర్‌లోనే డిఫరెంట్ సబ్జెక్ట్, పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ చివరి దశలో ఉంది. ముమ్ముందు మరిన్ని అప్డేట్‌లతో ఆడియెన్స్‌ని ఆకట్టుకోనున్నారు.

ఈ సినిమాకి కృష్ణ సౌరభ్ సంగీతాన్ని అందిస్తుండగా.. వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు రాయగా.. కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటల్ని రాస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.

## బాక్సాఫీస్ షేక్ చేసిన 'పెద్ది'.. తొలిరోజు వసూళ్లు ఎంతంటే?




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లీడ్ రోల్ లో బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన స్పోర్ట్స్ డ్రామా పెద్ది మూవీ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. వరల్డ్ వైడ్ గా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ చిత్రం తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు మూవీ టీమ్ ప్రకటించింది. విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొనగా, మొదటి రోజు కలెక్షన్లు ఆ అంచనాలకు తగ్గట్టు ఉండటం విశేషం. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, పాన్ ఇండియా వైడ్ గా సినిమా తొలి రోజు సుమారు రూ.69.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించగా, గ్రాస్ కలెక్షన్లు రూ.82 కోట్లకు పైగా నమోదైనట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్ లో కూడా పెద్దికి మంచి రెస్పాన్స్ లభించింది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల నుంచే సాలిడ్ వసూళ్లు రావడంతో విదేశీ మార్కెట్లలోనూ సినిమా ఎఫెక్ట్ క్లియర్ గా కనిపించింది. వరల్డ్ వైడ్ వసూళ్లు- రూ.135.36 కోట్లు (అఫీషియల్) ఇండియా వైడ్ వసూళ్లు- రూ.82 కోట్లు గ్రాస్ (అంచనా) తెలుగు రాష్ట్రాల వసూళ్లు- రూ.48 కోట్ల గ్రాస్ (అంచనా) రాష్ట్రాల వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. ఆ రెండు రాష్ట్రాల నుంచి రూ.48 కోట్లకు పైగా గ్రాస్ వచ్చినట్లు సమాచారం. కర్ణాటక, తమిళనాడు, కేరళతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ సినిమా సాలిడ్ వసూళ్లు సాధించింది. ముఖ్యంగా నార్త్ లో విడుదలైన సెంటర్స్ లో ఆక్యుపెన్సీ పెరగడం మూవీ టీమ్ కు మరింత ఉత్సాహాన్నిచ్చింది.టికెట్ బుకింగ్ ల పరంగా కూడా పెద్ది మంచి జోరు చూపించింది. తొలి రోజు ప్రీమియర్ షోలతో కలిపి మూడు మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు వార్తలు వస్తున్నాయి. రెండో రోజు, వీకెండ్ అడ్వాన్స్ బుకింగ్ లు కూడా సాలిడ్ రేంజ్ లో ఉండటంతో రానున్న రోజుల్లో సినిమా వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు ఇప్పుడు అంచనా వేస్తున్నారు. ఇక పెద్ది కథ విషయానికొస్తే.. 1990ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే స్టోరీ ప్రేక్షకులను ఎమోషన్స్ కు దగ్గర చేస్తుంది. విజయనగరం జిల్లాలో గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న ఓ చిన్న గ్రామం చుట్టూ కథ తిరుగుతుంది. ఆ గ్రామానికి చెందిన యువకుడు పెద్ది పాత్రలో చరణ్ నటించారు. సాధారణ కూలీగా జీవనం సాగించే అతడు క్రీడలపై ఉన్న ఆసక్తితో ముందుకు సాగుతాడు. పరిస్థితుల కారణంగా తనకు ఇష్టమైన క్రికెట్ ను వదిలి మరో మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది.ఆ తర్వాత అతని జీవితంలో చోటు చేసుకున్న పరిణామాలు, గ్రామానికి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యం, క్రీడల ద్వారా తనను తాను నిరూపించుకోవాలనే పట్టుదల కథలో మెయిన్ ఎలిమెంట్స్. విలేజ్ ఎన్విరాన్మెంట్, స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్, ఎమోషనల్ సీన్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏదేమైనా పెద్ది తొలిరోజు వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ గా కనిపించింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్, వీకెండ్ బుకింగ్స్ లో కూడా జోరు కొనసాగితే పెద్ది చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలుస్తుందనే చెప్పాలి.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com